PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 194 | విజయవాడ, బుధవారం 15 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 15 February 2023 | Rs

ప్రకాశం జిల్లాలో స్వల్ప భూకంపం

ప్రజాశక్తి-ముండ్లమూరు (ప్రకాశం)

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది. మండలంలోని ముండ్లమూరు, వేంపాడు, పోలవరం, శంకరాపురం గ్రామాల్లో సుమారు రెండు సెకన్లపాటు భూమి కంపించడంతో ఇంట్లోని సామాన్లు కిందపడిపోయాయి. ఒక్కసారిగా శబ్దంతో భూమి కంపించండంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలో నుండి బయటకు పరుగులు తీశారు.

త్రిపుర మహిళా కమిషన్ చైర్మన్‌పై దాడి



- చీర లాగేసి..జాకెట్టు చింపేసి దాష్టికం

లోపలి పేజీలో..



రాష్ట్ర వ్యాప్తంగా 20 టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను జెండా ఊపి ప్రారంభించిన సిఎం జగన్

బిబిసిపై ఐటి దాడులు

- సిబ్బంది ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం
- కక్ష సాధింపునకు దిగిన కేంద్రం
- ప్రతిపక్షాల ఆగ్రహం



న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్లు...నరేంద్రమోడీ పాత్రపై డాక్యుమెంటరీ రూపొందించి విడుదల చేసిన ప్రఖ్యాత మీడియా సంస్థ బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌పై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగింది. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తోందని ఆరోపణలు ఎదుర్కుంటున్న ఐటి విభాగం బిబిసిపై దాడికి దిగింది. దేశ రాజధాని ఢిల్లీ నగరంతో పాటు, ముంబాయిలోనూ ఉన్న బిబిసి కార్యాలయాల్లో మంగళవారం ఉదయం ఐటి అధికారులు అనూహ్యంగా సోదాలు ప్రారంభించారు. స్థానిక పోలీసుల రక్షణతో పెద్దసంఖ్యలో బిబిసి కార్యాలయాల వద్దకు చేరుకున్న ఐటి అధికారులు ముందుగా సిబ్బంది నుండి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్యాలయాల్లోనూ అక్కౌంటింగ్ సిబ్బంది మినహా మిగిలిన వారిని ఇళ్లకు పంపించేశారు. ఇళ్లకు వెళ్తున్న వారి ఫోన్లకు కూడా తమ వద్దే పెట్టుకున్నారని చెబుతున్నారు. తాము చెప్పేంతవరకు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని ఉద్యోగులకు చెప్పినట్లు సమాచారం. కొత్తగా ఎవరినీ కార్యాలయాల్లోకి అనుమతించలేదు. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామం దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. ప్రతిపక్షాలతో పాటు పాత్రికేయ సంఘాలు కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించాయి. దాడులపై బిబిసి ప్రతినిధి స్పందిస్తూ, 'ప్రస్తుతం బిబిసి కార్యాలయాల్లో ఐటి అధికారులు వున్నారు. మేం వారికి పూర్తిగా సహకరిస్తున్నాం. సాధ్యమైనంత త్వరలో ఈ పరిస్థితి చక్కబడుతుందని మేం ఆశిస్తున్నాం.' అని చెప్పారు. 'ఇవి ఐటి అధికారుల దాడులే, వారు మా ఫోన్లన్నంటినీ తీసేసుకున్నారు.' అని బిబిసి జర్నలిస్టులు తెలిపారు. 'తమ జర్నలిజం ఎప్పటిమాదిరే కొనసాగుతుందని, తమ వీక్షకులకు నిబద్ధతతో సమాచారాన్ని అందించడానికే తాము ధృఢనిశ్చయంతో ఉన్నాం' అని బిబిసి అధికారికంగా ప్రకటించింది. అయితే, ఐటి అధికారులు మాత్రం తాము దాడులు చేయడం లేదని, పన్నుల చెల్లింపుల్లో బిబిసి అవకతవకలకు పాల్పడట్లు సమాచారం వచ్చిందని, వాటికి సంబంధించి సర్వే మాత్రమే చేస్తున్నామని చెబుతున్నారు. ఆధారాలు దొరికితే సర్వేనే దాడిగా మారుతుందని తెలిపారు.

వినాశకాలే.....కాంగ్రెస్

ఐటి దాడులను బెదిరింపు ఎత్తుగడలుగా కాంగ్రెస్ అభివర్ణించింది. వినాశకాలే ...విపరీత బుద్ధి అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేష్ వ్యాఖ్యానించారు. విమర్శ అంటే మోడీ ప్రభుత్వం భయపడుతోందని ఈ చర్యలను బట్టి అర్థమవుతోందని పేర్కొన్నారు.

గొంతునొక్కే యత్నం : సిపిఎం

మోడీ క్వశ్చన్ డాక్యుమెంటరీని ప్రసారం చేసినందుకు బిబిసి గొంతునొక్కడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తోందని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో విడుదల చేసిన ప్రకటనలో ఐటితో పాటు ఇతర ఏజెన్సీలచేత దాడులు చేయించి భారతీయ మీడియాను భయపెట్టడం మోడీ ప్రభుత్వ వ్యూహమని, ఇప్పుడు దేశంలో మిగతా 5 లో

పర్యాటకుల భద్రతే లక్ష్యం

- 20 టూరిస్ట్ పోలీసు స్టేషన్‌లను ప్రారంభించిన సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల సందర్శన కోసం వచ్చే పర్యాటకుల భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పర్యాటక ప్రాంతంలో ప్రత్యేకంగా టూరిస్ట్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 20 టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లను సిఎం జగన్ జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో టూరిస్ట్ పోలీస్ స్టేషన్ అనే మరో మంచి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పోలీసుశాఖను గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎన్నో సంస్కరణలు అమలు చేసి, ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. పోలీసులు స్నేహితులే అనే భావనను తీసుకురాగలిగామని, ఇంతకముందు జరగని రీతిలో పోలీస్ వ్యవస్థలో పెద్దఎత్తున మార్పులు తీసుకొచ్చామని అన్నారు. పోలీస్ స్టేషన్‌లలో రిసెప్షనిస్టులను పెట్టి ఫిర్యాదుదారులకు సమస్య లేకుండా చేశామని చెప్పారు. పర్యాటకులకు అన్ని రకాలుగా భద్రత కల్పించేందుకు ఈ టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు దోహదపడతాయని తెలిపారు. యాత్రికులు నిర్భయంగా పర్యాటక ప్రదేశాల్లో గడిపేందుకు ఈ పోలీస్ స్టేషన్లు ఉపయోగపడతాయని అన్నారు. హోంశాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు వచ్చే విదేశీ, పొరుగు రాష్ట్రాల పర్యాటకులతోపాటు మహిళలకు ఈ పోలీస్ స్టేషన్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రతి టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లో మహిళా సిబ్బంది కూడా ఉంటారని అన్నారు. సిఎం ఆదేశాల మేరకు ఈ టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేశామని డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మరికొన్ని ప్రాంతాల్లో ఈ స్టేషన్‌లు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఆరుగురు సిబ్బంది ఉంటారని, షిఫ్ట్‌కు ఇద్దరు చొప్పున విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పోలీస్ స్టేషన్‌ల నిర్వహణ కోసం స్థానిక సంస్థల సహకారాన్ని తీసుకుంటామన్నారు.



పుస్తక మహోత్సవ్‌లో ఉద్రిక్తత

- దళిత సంఘాల ఐక్య వేదిక నాయకుల ఆందోళన
- వినతి పత్రం తీసుకోకుండా వెళ్లిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లోపలి పేజీలో..

నిందితుడు రాజుపై రౌడీషీట్

- మీడియా ముందుకు హాజరుపర్చిన పోలీసులు
- బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా
- హోంమంత్రి తానేటి వనిత

కుర్చీపై మూత్రం


- దళిత జడ్‌పిటిసికి ఘోర అవమానం
- పోలీసులకు ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

'అంటరానితనం మహాపాపం' అని భారత రాజ్యాంగం చెబుతోంది. మనం ఇటీవల 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నాం. ప్రాథమిక హక్కులు గురించి పాలకులు గొప్పగా ఉపన్యసించారు. అస్పృశ్యతను అంతమొందించామని గొప్పలు చెప్పారు. అయితే ఇవన్నీ వట్టి మాటలే... ఇంకా సమాజంలో దళితుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం వివక్ష తన రూపం మార్చుకుంది. ఇందుకు తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో జరిగిన సంఘటనే నిలువెత్తు సాక్ష్యం. ఆధిపత్య కులాల వారు దళితుల పట్ల ఎలా వివక్ష చూపుతున్నారో ఈ సంఘటన అద్దం పట్టింది. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితుని కథనం ప్రకారం... తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండల అధికార పార్టీ జడ్‌పిటిసి సభ్యునిగా దళిత సామాజిక తరగతికి చెందిన మన్నెం శీనయ్య ఉన్నారు. ఆయన పదవి చేపట్టి దాదాపు మూడేళ్లు అవుతోంది. అయినా, ఇటీవల వరకూ ఆయనకు మండల పరిషత్తు కార్యాలయంలో గది కానీ, కుర్చీ కానీ కేటాయించలేదు. ఈ విషయాన్ని ఆయన ఇటీవల గూడూరు శాసనసభ్యులు వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో, ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి గది కేటాయింపజేశారు. ఎమ్మెల్యే వరప్రసాద్ స్వయంగా విలువైన కుర్చీ కొనిచ్చారు. ఆ కుర్చీని శీనయ్య తనకు కేటాయించిన గదిలో వేసుకున్నారు. ఈ తెలుసుకున్న స్థానిక వైసిపి నేత ఒకరు తనను పిలిచి కులం పేరుతో దూషించారని, 'పెగ్గు ఎక్కువైందా' అంటూ తూలనాడారని 'ప్రజాశక్తి'కి శీనయ్య తెలిపారు. తన అనుమతి లేకుండా కుర్చీలో ఎలా కూర్చుంటావో చూస్తానంటూ తనను హెచ్చరించారని, ఎమ్మెల్యే వరప్రసాద్ తనకు ఈ కుర్చీ ఇచ్చారని తాను బదులిచ్చానని, తనకు తెలియకుండా ఎమ్మెల్యేతో ఎలా మాట్లాడుతావని వైసిపి నాయకుడు నన్ను బెదించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం తన కార్యాలయానికి వెళ్తానని, తన కుర్చీలో ఎవరో మూత్రం పోసినట్లు గుర్తించానని తెలిపారు. ఈ విషయం స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అయినా, వారు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, స్థానికంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని శ్రీనయ్య చెప్పారు. దీంతో, మంగళవారం తిరుపతి కలెక్టరుకు ఫిర్యాదు చేయడానికి వచ్చానని తెలిపారు. కలెక్టరు అందుబాటులో లేకపోవడంతో తిరుపతి ఎస్‌పి కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశానని చెప్పారు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని తిరుపతి పోలీసులు హామీ ఇచ్చినట్లు శ్రీనయ్య తెలిపారు. ప్రవీణ్‌రెడ్డే మూత్రం పోయించి ఉంటారని ఆయన ఆరోపించారు. దళిత ప్రజాప్రతినిధి కుర్చీపై మూత్రం పోయడం చాలా దారుణమని దళిత సంఘాలు పేర్కొన్నాయి. బాధ్యునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.



తనకు జరిగిన అవమానాన్ని మండల దళిత నాయకుడు వాకాడు ప్రభాకర్ కి వివరిస్తున్న జడ్‌పిటిసి సభ్యులు శీనయ్య (సర్కిల్లో ఉన్న వ్యక్తి)



యూనివర్శిటీలో పోలీసుల తనిఖీలు

మిచిగన్ వర్శిటీలో కాల్పులు

- ముగ్గురు మృతి, పలువురికి గాయాలు

ఈస్ట్ లాన్సింగ్ : మిచిగన్ రాష్ట్ర విశ్వవిద్యాలయ ప్రాంగణం..సోమవారం రాత్రి తుపాకీ కాల్పులతో దద్దరిల్లింది. ఈ కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. పలువురు గాయపడ్డారు. పొట్టిగా వున్న వ్యక్తి ముఖానికి మాస్కు ధరించి ఈ కాల్పులు జరిపినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే పరారీ అయ్యాడని అనుమానిస్తున్నారు. విశ్వవిద్యాలయంలోని బెర్కీ హాల్ సమీపాన స్టూడెంట్ యూనియన్ స్పాట్ వద్ద రాత్రి 8.30 గంటల సమయంలో కాల్పులు చోటు చేసుకున్నాయని పోలీసులు పేర్కొన్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. మిచిగన్ వర్శిటీ కేంపస్‌లో దాదాపు 50 వేల మంది గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు చదువుకుంటున్నారు.


కేంద్ర బడ్జెట్, అదాని అవినీతిపై 24న నిరసనలు : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం, అదాని అవినీతికి వ్యతిరేకంగా ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ నెల 12, 13 తేదీల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబి హాజరైన విషయం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, చేపట్టాల్సిన కర్తవ్యాలపై సమావేశం చర్చించింది. ఈ మేరకు సమావేశం తీసుకున్న నిర్ణయాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా వివరించారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం భారీ కోతలు విధించిందని తెలిపారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించి, ధరలు పెంచిందని పేర్కొన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలు, ఎరువులు అందక రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు అప్పులు రెట్టింపై ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయన్నారు. కౌలు రైతులను కనీసం గుర్తించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో భారీగా కోతలు పెట్టడం అంటే పేదల కడుపు కొట్టడం తప్ప మరోటి కాదని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను ఎత్తివేయడానికి తోడు బడ్జెట్‌లో సంక్షేమ నిధులను భారీగా తగ్గించేశారని తెలిపారు. ప్రజా పంపిణీ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేశారన్నారు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న జనానికి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా ఈ బడ్జెట్ భారాలు కోలుకోలేని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడమే కాకుండా, విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు కాని పరిస్థితి ఉందన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు నామమాత్రంగా నిధులు విడుదల చేశారన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకపోగా, పుండుపై కారం చల్లినట్లుగా తుంగభద్ర కెనాల్స్ కింద నీటి సరఫరాను దెబ్బకొట్టే కర్ణాటకలోని అప్పర్ భద్రకు కేంద్ర ప్రభుత్వం నిధులివ్వడం దారుణమన్నారు. ఆంధ్ర, కర్ణాటక మధ్య విద్వేషాలు పెంచి రానున్న కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్రం కుయుక్తులు పన్నుతోందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చర్యలు ఆపకుండా, కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, పోలవరానికి నిధులు కూడా రాష్ట్రానికి కేంద్రం మిగతా 5 లో

కొవ్వాడకు 2,080 ఎకరాలు

- పునరావాస స్థలం గుర్తింపు
- పనుల కోసం కలెక్టర్ వద్ద రూ. 500 కోట్లు
- ఆర్‌టిఐ ప్రశ్నకు జవాబు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ఎన్ని ఉద్యమాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ముందుకే సాగుతోంది. విద్యుత్ కేంద్రం అంచనా వ్యయం ఖరారు చేయలేదని చెబుతూనే ప్రజల ముంగిట అణుకుంపటిని రగల్చడానికి గుట్టుచప్పుడు కాకుండా పనులు చేస్తోంది. సహ చట్టం కార్యకర్త ఇనగంటి రవికుమార్ వివరాల కోసం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు వివరాల కోసం దరఖాస్తు చేయగా, వచ్చిన సమాధానాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే 2079.66 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం సేకరించిందని, ఆ భూమి ప్రస్తుతం ఎన్‌పిసిఐఎల్ స్వాధీనం చేసుకుందని వివరించింది. ఆ సంస్థ పేరుమీదకు భూమి కూడా మారిపోయిందని కూడా జవాబులో పేర్కొనడం గమనార్హం. ఈ భూమిలో ఇప్పటివరకు ఉంటున్న వారికి సహాయ పునరావాసం పథకం కింద ఇళ్లను, స్థలాలను అందించేందుకు కొత్త ప్రాంతాన్ని కూడా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్లాంట్ ఏర్పాటుకోసం జిల్లా యంత్రాంగం వద్ద 500 కోట్ల రూపాయలను డిపాజిట్ చేసినట్లు కూడా కేంద్ర సంస్థ పేర్కొంది. నిధులు ఇచ్చినట్లు అంగీకరిస్తూనే ప్లాంట్ ఏర్పాటుకు ఎంత వ్యయం అవుతుందన్నది మాత్రం ఇంకా ఖరారు చేయలేదని తెలిపింది. తొలుత వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆరు రియాక్టర్లను ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదించగా, గతేడాది దీనిని 1208 మెటావాట్లుతో ఆరు రియాక్టర్లుగా మార్పు చేసిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్న సమయంలో చేసిన భారత పర్యటనలో కొవ్వాడ విషయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టులో ఆయన అల్లుడు భాగస్వామిగా ఉండటమే ఆయన ప్రత్యేక ఆసక్తికి కారణామని అప్పట్లో వార్తలు వచ్చాయి.

సర్వం సిద్ధం

- నేటి నుంచి అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం 10వ మహాసభ
- హౌరాకు చేరుకున్న ప్రతినిధులు



మహాసభకు విస్తృతంగా జరుగుతున్న ఏర్పాట్లు

హౌరా నుండి ప్రజాశక్తి ప్రతినిధి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) 10వ మహాసభకు పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నగరం సిద్ధమైంది. నేటి నుండి 18వ తేది వరకు నాలుగురోజుల పాటు జరిగే మహాసభను విజయవంతం చేయడానికి విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోనిచ రాష్ట్ర ప్రభుత్వం నుండి, మరోవైపు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి తదితర మతోన్మాద శక్తుల నుండి ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ వాటిని ఎప్పటికప్పుడు అధిగమిస్తూ వాలంటీర్లు శ్రమించారు. ఫలితంగా హౌరా నగరంలో ఎక్కడ చూసినా వ్యవసాయ కార్మిక సంఘపు జెండాలు రెపరెపలాడుతు స్థానికుల్లో పోరాట స్ఫూర్తిని కలిగిస్తున్నాయి. వ్యవసాయ కార్మిక సంఘ ఆవిర్భావానికి కృషి చేసిన త్రిమూర్తులు పుచ్చలపల్లి సుందరయ్య, జ్యోతిబసు, ఎకె గోపాలన్‌లను గుర్తుచేస్తూ నగరంలోని పలు ప్రాంతాల్లో పోస్టర్లు ఏర్పాటు చేశారు. మహాసభ జరిగే శరత్‌చంద్ర ఆడిటోరియంకు జ్యోతిబసు నగర్ అని పేరు పెట్టారు. బుధవారం నుండి ప్రారంభం కానున్న మహాసభకు దేశ వ్యాప్తంగా 700 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. వీరిలో అత్యధికులు సోమవారం సాయంత్రానికే హౌరాకు చేరుకున్నారు. మహాసభలో ఆయా రాష్ట్రాలలో జరిగేన వ్యవసాయ కార్మిక పోరాటాలు, అనుభవాలను చర్చించనున్నారు. అగ్రనేతలైన బిమన్ బసు తదితరులు కూడా ఈ సభలకు వస్తున్నారు. బెంగాల్‌లో ఐదు ప్రాంతాలనుండి ప్రారంభమైన అమరవీరుల జాతాలు కూడా నేడు మహాసభ వద్దకు చేరుకోనున్నాయి. జాతీయ స్థాయి నాయకులు ఈ నాలుగు జ్యోతులను అందుకోనున్నారు. బుధవారం ఉదయం పతాకావిష్కరణ మిగతా 5 లో

ఐఐటి -బొంబాయి విద్యార్థి ఆత్మహత్య

ముంబయి: ప్రతిష్టాత్మక ఐఐటి-బొంబాయి ఇనిస్టిట్యూట్‌లో మొదటి సంవత్సర బిటెక్ (కెమికల్) విద్యార్థి దర్శన్ సోలంకి (18) ఆదివారం నాడు హాస్టల్ బిల్డింగ్‌లోని ఏడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది సంస్థాగత హత్య అని అంబేద్కర్ పెరియార్ పూలే స్టడీ సర్కిల్ స్టూడెంట్స్ గ్రూపు ఆరోపించింది. కుల వివక్ష వల్లే అతను ఈ బలవనర్మరణానికి పాల్పడ్డాడని అది ఒక ప్రకటనలో పేర్కొంది. దీనిపై ఐఐటి ఉన్నతాధికారులు స్పందిస్తూ, విద్యార్థులు ఏ విధమైన కుల వివక్ష ఎదుర్కోవడం లేదని,. దీనిపై అంతర్గత కమిటీ విచారణ, పోలీసులు కూడా దర్యాప్తు సాగుతున్నందున నిగ్రహం పాటించాలని విద్యార్థులను కోరారు.విద్యార్థులు ఇక్కడి ఐఐటి ఇనిస్టిట్యూట్‌లో చేరినాక అతని కులానికి సంబంధజంచిన వివరాలను ఎవరికీ (విద్యార్థులకు కానీ, టీచర్లకు కానీ) ఎన్నడూ తెలియనివ్వమని అన్నారు. ఎవరూ వివక్ష చూపకుండా ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తుంటామని, అయితే ఏ చర్యలైనా వందశాతం సఫలమవుతాయని అనుకోలేం కదా అని అన్నారు. అహ్మదాబాద్‌కు చెందిన ఆ విద్యార్థి హాస్టల్ బిల్డింగ్ ఎదుట నెత్తుటి మడుగులో పడి ఉండడాన్ని సెక్యూరిటీ గార్డు మొదట గమనించాడని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఘటనా స్థలిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని అన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు

- సిఎస్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు త్వరగా బదిలీ ప్రకటన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి జానిపాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫెడరేషన్ ప్రతినిధుల బృందం మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అన్ని విభాగాల సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు, ఎఎన్‌ఎంలతో పాటు మిగిలిన డిపార్టుమెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగుల సాధారణ, అంతర్ జిల్లా బదిలీలు, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డిడిఒ బాధ్యతలు, నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు 2020వ సంవత్సరంలో రెండో బ్యాచ్‌లో రిక్రూట్‌మెంట్ అయిన ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. సిఎస్‌ను కలిసిన వారిలో పలువురు ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

వేస్ అండ్ మీన్స్ వల్ల వేతనాలు ఆలస్యం

- సిఎం ఆర్థిక వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వేస్ అండ్ మీన్స్ పరిస్థితుల కారణంగా వేతనాలు ఆలస్యమై ఉండొచ్చని, ఆదాయం తగ్గి అప్పులు పెరిగి, సంక్షేమ పథకాల అమలు వల్ల కొన్నిసార్లు జీతాల చెల్లింపు ఆలస్యం జరగవచ్చని సిఎం ఆర్థిక వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో పెండింగ్ బిల్లులు రూ.40 వేలకోట్లు ఉన్నాయని, అది ప్రస్తుతం రూ.21,673 వేలకోట్లకు తగ్గిందన్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు ఇబ్బందికర పరిస్థితుల్లో ఎందుకు ఉన్నారో, ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారో తెలియదన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంగా రూ.1.80 లక్షల కోట్లు అని ఎలా ప్రచారం చేస్తారని, టిడిపి హయాంలో ఎన్ని బిల్లులు క్లియర్ అయ్యాయో తనకు తెలీదన్నారు. గతంతో పోలిస్తే ఆదాయాలు తగ్గాయని, ఎప్పుడూ లేనంతగా రూ.1.92 లక్షల కోట్లు డిబిటి ద్వారా చెల్లించామని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

తిరోగమనంలో విద్య, వైద్యరంగాలు

- యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని కీలక రంగాలైన విద్య, వైద్యరంగాలు తిరోగమనంలో పయనిస్తున్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. నాడు-నేడు కింద వైద్యరంగం అభివృద్ధికి వేలకోట్లు ఖర్చుచేస్తున్నట్లు ప్రచార ఆర్భాటం చేస్తున్న సిఎం జగన్.. ఆచరణలో మాత్రం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ నిధులనూ దారి మళ్లించడం దేనికి సంకేతం? పేదలన్నా వారి ఆరోగ్యమన్నా సిఎం జగన్‌కు లెక్కలేదన్నారు. సోషల్ ప్రోగ్రెస్ ఇండెక్స్ ప్రకారం పేదలకు ప్రాథమిక వైద్యం అందించడంలో దేశంలో రాష్ట్రం 23వ స్థానానికి దిగజారడం ఆరోగ్య రంగంపై జగన్ చిత్తశుద్ధిని తెలియజేస్తుంద న్నారు. టిడిపి హయాంలో పేదల ఆరోగ్య పరిస్థితి మెరుగపరిచేందుకు చంద్రబాబు 33 స్కీమ్స్ అమలు చేస్తే, జగన్ వాటన్నిటికీ తిలోదకాలు ఇవ్వడంతో పేదలకు మెరుగైన వైద్యం దూరమైందన్నారు. పులివెందుల 100 పడకల ప్రభుత్వాస్పత్రిలో నలుగురు వైద్యులు కూడా అందుబాటులో లేరంటే.. రాష్ట్రమంతటా పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని యనమల పేర్కొన్నారు.

బయోమెట్రిక్ నుంచి మినహాయించండి

- రాష్ట్రవ్యాప్తంగా విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

బయోమెట్రిక్ నుంచి మినహాయింపునివ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించారు. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు.రికవరీ చేసిన డిఎ తిరిగి చెల్లించాలని, ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని నినాదాలు చేశారు.

తిరుపతి, చిత్తూరు కలెక్టరేట్ల వద్ద విఆర్‌ఎలు ఆందోళన చేశారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని నినాదాలు చేశారు. తిరుపతి కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టారు. అనకాపల్లిలో టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు మద్దతు తెలిపారు. ఫేస్ యాప్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు విఆర్‌ఎలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే ధర్నా చేపట్టారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. రెవెన్యూ సహాయకుల వేతనం పెంచాలని నినాదాలు చేశారు. కృష్ణా జిల్లా బందరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. గుంటూరు, నరసరావుపేట కలెక్టరేట్ల వద్ద నిరసన తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా విఆర్‌ఎల సమస్యను పరిష్కరించలేదని పలువురు నాయకులు విమర్శించారు. కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలిపి, డిఆర్‌ఒలకు వినతిపత్రం అందజేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టారు. విఆర్‌ఎల్లో చాలా మంది నిరక్షరాస్యులున్నారని, వీరికి స్మార్ట్‌ఫోన్ వాడకమే తెలియదన్నారు. ఫేస్ రికగ్నిషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ నెల్లూరు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏలూరు, భీమవరం కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టారు. ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయించాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



విశాఖ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్న విఆర్‌ఎలు

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్



విలువలను కాపాడే అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు కోరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని శోభ లాడ్జిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ చేపడుతున్న విధ్వంసకర రాజకీయాలను రాష్ట్రంలోని మేధావులు ఐక్యంగా ఎదుర్కోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎన్నికల నిబంధనల అతిక్రమణ జరుగుతోందని విమర్శించారు. మాట్లాడలేని విగ్రహాలకు ముసుగులేశారని, గడపగడపకు వైసిపి కార్యక్రమాన్ని, ఓట్ల కోసం గ్రామ/వార్డు వలంటీర్లను ఇంటికి పంపడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. వలంటీర్లను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపయోగించకూడదని న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులు, విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహిస్తోన్న, మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు బలపరుస్తోన్న, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేస్తోన్న, రాజకీయ విలువలను కాపాడేందుకు పోటీ చేస్తోన్న, 200 ప్రజాసంఘాల మద్దతు ఇస్తోన్న తనను గెలిపించాలని కోరారు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోన్న పార్టీల అభ్యర్థులను తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతల మోహన్‌రావు, ప్రముఖ సీనియర్ న్యాయవాది బి.శంకరయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవ్‌లో ఉద్రిక్తత

- దళిత సంఘాల ఐక్య వేదిక నాయకుల ఆందోళన
- వినతిపత్రం తీసుకోకుండా వెళ్లిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



విజయవాడ పుస్తక మహోత్సవంలో మంగళవారం సాయంత్రం కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పుస్తక మహోత్సవ్‌లో పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషర్‌రెడ్డి హాజరయ్యారు. సభ అనంతరం కిషన్‌రెడ్డి వేదిక దిగి వెళుతున్న సమయలో బిజెపి నేతలు భూకబ్జాలకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించారు. మంత్రి వారిని లెక్కచేయకపోవటంతో పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పుస్తక మహోత్సవ్ ప్రాంగణం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకాని గ్రామ పంచాయతీకి చెందిన 4404 చదరపు గజాల భూమిని 2014లో దళితుడైన గొల్ల వరప్రసాద్ కొనుగోలు చేశారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, రాష్ట్ర నాయకులు లక్ష్మీపతి రాజా, వల్లభనేని సుధాకర్ చౌదరి ఆ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయమై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం తీసుకోకుండానే కేంద్ర మంత్రి వెళ్లిపోయారని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కె.దయాసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతమాల వెంకట స్వామి, మేదర సురేష్ కుమార్ పలువురు ఉన్నారు.

అనంతరం విశాలాంధ్ర పబ్లిషర్స్ ప్రచురించిన పుస్తకాల ఆవిష్కరణ సభ ప్రారంభంలో సభాధ్యక్షులు గడ్డం కోటేశ్వరరావు పరిచయ వాక్యాలు చదువుతుండగా కొంతమంది గట్టిగా నినాదాలు చేస్తూ అడ్డుపడ్డారు. దీంతో కొద్దిసేపు అక్కడ వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో బుక్‌ఫెస్టివల్ సొసైటీ కన్వీనర్ డి.విజయకుమార్ వేదికపై నుంచి కిందకు వచ్చి వారిని సముదాయించారు.

మోడీ 20 ఏళ్లు పుస్తకావిష్కరణ...

అంతకుముందు పుస్తక మహోత్సవ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమెస్కో ఆధ్వర్యంలో ప్రచురించిన మోడీ 20 ఏళ్లు పుస్తకాన్ని కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ప్రకాష్ జవదేకర్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు,. ఎమెస్కో అధినేత విజయకుమార్ ఉన్నారు.



ఆధునిక టెక్నాలజీతో వేగవంతమైన రైళ్లు

కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆధునిక టెక్నాలజీతో వేగవంతమైన రైళ్లు ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కొత్త లైన్లు, ఎలక్ట్రిఫికేషన్, ట్రిప్లింగ్ పనులు ఉభయ రాష్ట్రాల్లో వేగంగా జరుగుతున్నాయని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ధర్మవరం-విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలును మచిలీపట్నం వరకు పొడిగించడంతో ఆ రైలును జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. డిపిఆర్ సిద్ధమయ్యాక విజయవాడ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

అమరావతిలో ధ్యానబుద్ధవనం, థీమ్ పార్కు ప్రారంభం

అమరావతిలో నూతనంగా నిర్మించిన ధ్యాన బుద్ధవనం, పర్యాటక వసతి గృహం, థీమ్ పార్క్ ఇన్ఫర్మేషన్ సెంటర్లను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజాతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. థీమ్‌పార్కులో మొక్కను నాటారు. అనంతరం అమరావతి మ్యూజియంను సందర్శించారు.

గ్రానైట్ పరిశ్రమలకు సర్వే రాళ్ల తయారీ ఆర్డర్లు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే కోసం మూడు కోట్ల సర్వే రాళ్లు కావాల్సి ఉందని, గ్రానైట్ పరిశ్రమలకు సర్వే రాళ్ల తయారీ ఆర్డర్లు ఇవ్వనున్నామని గనులు, ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గనుల శాఖ అధికారులు, గ్రానైట్ పరిశ్రమలు అసోసియేషన్ ప్రతినిధులు, గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులతో సచివాలయంలో మంత్రి సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. సర్వే రాళ్ల తయారీ రేట్లపై ప్రభుత్వం సమీక్షించి అనుకూల నిర్ణయం తీసుకుంటుందన్నారు. గత మూడేళ్లలో మైనింగ్ కార్యకలాపాలు విస్తృతమయ్యాయని, మైనింగ్ రెవెన్యూ గణనీయంగా పెరుగుతోందన్నారు. ఇప్పటికే గ్రానైట్ లీజుదారుల నుంచి ఉచితంగా ముడిరాయిని సర్వేరాళ్ల కోసం అందిస్తున్నామన్నారు. ఆ ముడిరాయిలో నాణ్యత లేకపోవడం వల్ల రాళ్ల తయారీలో వ్యయం పెరుగుతోందన్నారు. గనులశాఖ ద్వారా ప్రభుత్వానికి రెవెన్యూలో పురోగతి సాధించామని తెలిపారు. 2019-20లో రూ.2,068 కోట్లు, 2020-21లో రూ.2,790 కోట్లు మైనింగ్ రెవెన్యూ సాధించామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,500 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే రూ.3,414 కోట్లు ఆర్జించామన్నారు. ఈ సమావేశంలో గనుల శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, గనులశాఖ సంచాలకులు విజి వెంకటరెడ్డి, గనులశాఖ సంయుక్త కార్యదర్శి డి రవదేవి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ దోపిడీ

- ప్రజా ధనాన్ని దోచుకుంటున్న వైసిపి నేతలు
- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి- పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)

వీరప్పన్ తరహాలో ఎక్కడైనా.. ఏమైనా.. దోచుకు దాచుకో.. అన్న సిద్ధాంతంతో వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం నుంచి ప్రారంభమైంది. కీలపూడి బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ..టిడిపి హయాంలో ఇసుక లారీ రూ.10వేలకు దొరికితే నేడు వైసిపి హయాంలో లక్ష రూపాయలకు విక్రయిస్తున్నారని విమర్శించారు. నాగలాపురం మండలం కోడియం బెడు వద్ద ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ రూ. కోట్లు దోచుకుంటున్నారని, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి 18 నెలలుగా ఇసుక దోపిడీ చేస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే ఇసుక, గ్రావెల్ దోపిడీ జరుగుతోందని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణాపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జగన్‌ది అధికార బలం అయితే.. మనది యువగళం అని వ్యాఖ్యానించారు. దశలవారీగా మద్యపాన నిషేధం చేసి వచ్చే ఎన్నికల్లో అక్కచెల్లెమ్మలను ఓట్లు అడుగుతానని జగన్ చెప్పారని, నేడు దశలవారీగా దుకాణాలు పెంచుకుంటూ పోతున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో నాలుగు ఫ్యాక్టరీలు చెరకు క్రషింగ్ చేసేవని, నేడు ఫ్యాక్టరీలు మూతపడేలా చేసి రైతులకు బకాయిలు చెల్లించుకుండా తిప్పించుకుంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. యాత్ర బుధవారం పిచ్చాటూరు మండలం కీలపూడి నుంచి ప్రారంభం కానుంది. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, జెడి రాజశేఖర్, పద్మనాభ రాజు, ఇలగోవన్ రెడ్డి, తిరుమలరెడ్డి, సతీష్ నాయుడు పాల్గొన్నారు.



బకాయిలు ఇప్పించాలని లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న చెరకు రైతులు

పొరుగు రాష్ట్రాల నుంచి జనసమీకరణ : మంత్రి రోజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లోకేష్ పాదయాత్రకు రాష్ట్ర ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి జనసమీకరణ చేస్తున్నారని పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా విమర్శించారు. విజయవాడలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి చంద్రబాబు, లోకేష్ టూరిస్టుల వంటి వారని అన్నారు. తన వాళ్ల గురించి, తన గురించి తప్పుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. హెరిటేజ్ వాహనాల్లో ఎర్రచందనం ఎలా తరలించారో అందరికీ తెలుసన్నారు.

లోకేష్‌కు చదువేరాదు : శివశంకర్ రెడ్డి

లోకేష్‌కు అసలు చదువే రాదని వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. కనీసం ఆంధ్రప్రదేశ్ అని పేరు రాయడం కూడా రాని వ్యక్తి లోకేష్ అని విమర్శించారు.

ఎస్ఎఫ్ఐ నేతలపై అక్రమ కేసులు

- దాడి చేసింది వారే.. కేసు పెట్టిందీ వారే..
- పోలీసులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-యంత్రాంగం

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నేతలను పోలీసులు వేధింపులకు గురి చేస్తూనే ఉన్నారు. వర్సిటీలో పోలీసులు దాడికి పాల్పడిన ఘటనపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌కుమార్ పంపిన ఫిర్యాదును బందరు తాలూకా పోలీసులు సోమవారం రాత్రి తిరస్కరించారు. దీంతో ఎస్ఎఫ్ఐ నేతలపై దాడి చేసిన ఎస్ఐ జి.వాసు, ఆయన సహకరించిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు కాపీని రాబర్ట్‌సన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు నేతలు అందించారు. ఈ సందర్భంలోనే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా నాయకులు కీర్తితోపాటు, మరికొందరిపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది. పోలీసులు తమపై దాడి చేయడమే కాకుండా అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నేతలు తెలిపారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ నేతలపై పోలీసుల దాడిని ఖండిస్తూ మంగళవారం కృష్ణా, ఎన్‌టిఆర్, విజయనగరం జిల్లాల్లో విద్యార్థి సంఘాల నిరసన వ్యక్తం చేశాయి. విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా చేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు ఎ.రవిచంద్ర, పిడిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు తదితరులు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి సంఘం నాయకుడి పట్ల పోలీసులు ప్రవర్తన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. దాడి చేసిన పోలీసులను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, గన్నవరం, మొవ్వ, ఉయ్యూరులో ధర్నాలు జరిగాయి.

విజయనగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ నేతలపై దాడికి పాల్పడిన యూనివర్సిటీ యాజమాన్యంపైనా, పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



మంత్రి రోజా ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న టిడిపి మహిళా నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నగరిలో ఉద్రిక్తత

- టిడిపి, వైసిపి నేతల మధ్య ఘర్షణ
- 38 మందిపై కేసులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

మంత్రి రోజాపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేసిన ఆరోపణలతో తిరుపతి జిల్లా నగరిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం నగరిలో లోకేష్ బహిరంగసభ నిర్వహించారు. రోజా కుటుంబసభ్యులు పెత్తనం చేలాయిస్తూ నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దార్ల ద్వారా లంచం తీసుకుంటూ వాటాలు పంచుకుంటున్నారని సభలో ఆరోపించారు. ఈ ఆరోపణలపై మంగళవారం విజయవాడలో రోజా ప్రెస్‌మీట్ పెట్టారు. తన కుటుంబ సభ్యుల మీద అసత్య ఆరోపణలు చేసిన లోకేష్‌ని చెంప మీద కొడతానని, దమ్ము, ధైర్యం ఉంటే తన ఇంటికి రావాలని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో నగరి మాజీ ఎంపిపి, రాష్ట్ర తెలుగు అధికార ప్రతినిధి మీరా, అరుణ ఆధ్వర్యంలో దాదాపు పది మంది మహిళలు మంత్రి రోజా ఇంట్లోకి చొరబడ్డారు. వీరిని పోలీసులు అరెస్టు చేసి నగరి పోలీస్‌స్టేషన్ తరలించారు. తమ మహిళా నేతలను అరెస్టు చేశారన్న విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకున్నారు. తమ వారిని విడిచిపెట్టాలంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో 38 మంది టిడిపి నాయకులపై కేసు నమోదు చేయడంతోపాటు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇంతలో మంత్రి రోజా ఇంట్లోకి టిడిపి మహిళా నాయకులు వచ్చారన్న విషయం తెలుసుకున్న వైసిపి కౌన్సిల్లర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు దాదాపు 1000 మంది పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని టిడిపి నాయకులతో ఘర్షణకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరుగ్రూపులతో చర్చలు జరిపి స్టేషన్ నుంచి బయటకు పంపించేశారు. స్టేషన్ బయట మళ్లీ ఇరు గ్రూపులు ఘర్షణకు దిగాయి. దీంతో పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టారు.

క్రషర్‌లో పని చేస్తూ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - మేడికొండూరు (గుంటూరు జిల్లా)

స్టోన్ క్రషర్‌లో పని చేస్తున్న కార్మికుడు అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్లలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పేరేచర్ల సమీపంలోని విజయ కాటన్ కాలనీకి చెందిన పి.సుబ్బారావు (42) సాయి కృష్ణ స్టోన్ క్రషర్‌లో పని చేస్తున్నారు. భార్య వ్యవసాయ కూలి. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం పనికి వెళ్లిన సుబ్బారావు పని చేస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. గమనించిన తోటి కార్మికులు వెంటనే గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. చికిత్స చేసే క్రమంలో సుబ్బారావు మృతి చెందారు. మృతుని కుటుంబానికి పరిహారం కోసం కొందరు కార్మికులు క్రషర్ యాజమాన్యంతో చర్చించగా ఫలించలేదు. విషయం తెలిసిన సిఐటియు మండల అధ్యక్షులు బాషా, నాయకులు సాదిక్ మంగళవారం ఉదయం మృతుని బంధువులతో కలిసి ఆందోళనకు దిగారు. క్రషర్‌లో జరుగుతున్న పనులను అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి సుబ్బారావు ఆధారమని, ఆయన చనిపోయాక భార్య, ఇద్దరు పిల్లలు ఎలా బతుకుతారని నిలదీశారు. దీంతో యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. మృతుని కుటుంబానికి రూ.7 లక్షలు పరిహారం అందించేందుకు అంగీకరించింది. తొలుత మట్టి ఖర్చుల కింద రూ.10 వేలతోపాటు రూ.రెండు లక్షల పరిహారం అందజేసింది. మిగతా రూ.5 లక్షలు ఈ నెల 25న ఇస్తామని అంగీకరించింది. దీంతో, ఆందోళన విరమించారు.

ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి

- పంటల బీమా పథకం కింద నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- మంత్రి కాకాణికి ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని, 21 రోజుల్లో రైతులకు ఇవ్వాల్సిన నగదును వారి ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం, ఎపి కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. గతేడాది 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, ఈ ఏడాది 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రకటించి, 30 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప, ప్రకాశం జిల్లాల్లో పప్పుశనగ పండించిన రైతులకు క్వింటాకు రూ.6 వేలు రేటుతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మంత్రికి నాయకులు విజ్ఞప్తి చేశారు. వాతావరణ బీమా అమలు చేసి పంటల బీమా పథకం కింద పరిహారం చెల్లించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. మాండూస్ తుపానుతో ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 50 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, పొగాకు రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

ఏడు లక్షల కోట్లు ఏమయ్యాయి

- ధాన్యం కొనుగోలుకు పోరాటం చేస్తాం : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - నందిగాం (శ్రీకాకుళం జిల్లా)

ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి వరకు రూ.9.27 లక్షల కోట్లు అప్పు ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అందులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్వయంగా రూ.1.80 వేల కోట్లు బటన్ నొక్కి ప్రజలకు అందించినట్లు చెప్పారని, మిగతా రూ.7 లక్షల కోట్లు ఏమయ్యాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా నందిగాంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సగటున 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇప్పటి వరకు 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని, మిగిలిన ధాన్యం ఎప్పుడు కొంటారని ప్రభుత్వ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా టిడిపికి లక్ష్యం పూర్తయ్యాయని చెబుతున్నారని అన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుంటే టిడిపి ఆధ్వర్యాన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. మూడున్నరేళ్ల పాలనలో వైసిపి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. గృహ నిర్మాణాల్లో దేశంలోనే రాష్ట్రం 28వ స్థానంలో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పేదలకు సొంతిల్లు కల్పిస్తున్నామని ఆర్భాటంగా ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.ఉజయకుమార్, మల్లా బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులకు నష్టం కలిగించొద్దు

- దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ ఆస్తులకు నష్టం, విఘాతం కలిగించే సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఇటువంటి కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. ఇటీవల కాలంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడులు చేస్తున్న సంఘటనలు, ఘటనలు, వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వేశాఖ సిపిఆర్ఒ సిహెచ్ రాకేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని వివిధ ప్రదేశాలను రైలు మార్గంతో కలుపుతూ మిలియన్ల మంది ప్రయాణికులకు సురక్షితమైన తక్కువ ఖర్చుతో కూడిన రవాణాను రైల్వే అందిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులు విచ్చలవిడిగా వందే భారత్ రైళ్లపై దాడికి పాల్పడుతుండటంతో రైళ్లకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైళ్లు, రైల్వే స్టేషన్లు, ప్రజల ఆస్తులకు నష్టం జరిగినట్లేనని తెలిపారు.

సమాజ పురోభివృద్ధికి సైన్స్ దోహదం

- జిల్లా విద్యా వైజ్ఞాన ప్రదర్శనలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న లక్ష్మణరావు, ఉండవల్లి శ్రీదేవి తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

సమాజ పురోగతికి సైన్స్ దోహదం చేస్తుందని, సకల చరాచర జీవుల్లో మానవుడు ఒక అద్భుతమని, అనుభవం, పరిశీలన, ప్రశ్నించటం వంటి మూడు చర్యల ద్వారా సైన్స్‌ను అభివృద్ధి చేశారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అరండల్ పేటలోని సెయింట్ ఇంగ్నేషియస్ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య ఆర్‌జెడి వి.ఎస్ సుబ్బారావు అధ్యక్షత నిర్వహించిన సభలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మానవాళి జీవితాన్ని సులభతరం చేయటానికి, శాస్త్రవేత్తలు ఓర్పి శ్రమించిన శాస్త్రవేత్తలు సమాజానికి ఆదర్శమని అన్నారు. ఉపాధ్యాయులు పుస్తకాలకు పరిమితం కాకుండా, బాహ్య ప్రపంచంలో జరుగుతున్న అంశాలను కలిపి బోధించాలని సూచించారు. అర్థం చేసుకుని చదివే విధంగా బోధించాలని, అటువంటి ఓరియంటేషన్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థులకు అలవడుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా విధానంలో కేవలం మార్కులపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారని, అలా కాకుండా విద్యార్థులు సమగ్రంగా అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. సభలో ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, డిఇఒ పి శైలజ ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో ఎంపిక చేసిన ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు.



వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- ఆశాల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి తమకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు మంగళవారం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.పదివేలు మాత్రమే చెల్లించి అనేకమైన పనులు చేయించుకుంటోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆశాలపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయన్నారు. వాటిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో కరోనా బారిన పడి మరణించిన ఆశా వర్కర్ల కుటుంబాలకు కేంద్రంగాని, రాష్ట్రంగాని ఎలాంటి ఆర్థిక సహాయ సహకారాలూ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రిటైర్మెంటు వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ.. ఆశాలు చేసే పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం

చర్యలకు ప్రకాశం ఎస్‌పి ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగం కోసం తండ్రినే మార్చివేసి ఉద్యోగం సంపాదించిన వ్యక్తిపై చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఒంగోలుకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి తన పెదనాన్నకు పుట్టిన వానిగా సర్టిఫికెట్లు తయారుచేయించి ఆయన ఉద్యోగాన్ని కైవసం చేసుకున్నాడు. శ్రీనివాసరావు తండ్రి పాండు రంగారావు, పెదనాన్న వెంకటరావు. రోడ్లు, భవనాలశాఖలో వెంకటరావు పనిచేసేవారు. అనారోగ్యంతో ఆయన చనిపోయిన తరువాత కొడుకునేనంటూ నకిలీ ధ్రువపత్రాలను తయారుచేసిన శ్రీనివాసరావు కారుణ్య నియామకం ద్వారా వెంకటరావు చేసిన అటెండర్ ఉద్యోగాన్ని సంపాదించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. తనను వెంకటరావు దత్తత తీసుకున్నట్లు కూడా ఒక సర్టిఫికెట్ సృష్టించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. కొంతకాలం తరువాత ఈ విషయం వెలుగులోకి రావడంతో వెంకటరావు కుటుంబీకులు సిఐడి అధికారులకు, ఒంగోలు జిల్లా కలెక్టరుకు, ఆర్‌అండ్‌బి అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీర్ఘకాలంపాటు శ్రీనివాసరావుపై ఎటువంటి చర్యలూ లేకపోవడంతో మరోసారి సిఐడి అధికారులను ఆశ్రయించగా, అక్కడి నుంచి ఆ ఫిర్యాదులు ఒంగోలు జిల్లా ఎస్‌పికి చేరుకున్నాయి. ఆ ప్రాంత డిఎస్‌పితో దర్యాప్తు చేయించగా, శ్రీనివాసరావు పేరుమీదే రెండు వేర్వేరు టెన్త్ సర్టిఫికెట్లు ఉన్నట్లు కూడా తేలింది. దత్తత చేసుకున్న ఐదేళ్ల తరువాతే కొన్ని హక్కులు సంక్రమిస్తాయని, అయితే శ్రీనివాసరావు సమర్పించిన దత్తత సర్టిఫికెట్‌లో కేవలం మూడు నెలలే అన్నట్లు ఉందని పోలీసులు తేల్చారు. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి నుంచి ఆర్‌అండ్‌బి అధికారులకు నివేదిక వెళ్లినట్లు తెలిసింది.

ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ వద్దు

- ఆర్‌ఎం కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణను నిరసిస్తూ కడప ఆర్‌టిసి ఆర్‌ఎం కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా ఆర్‌టిసి బస్టాండ్లను ప్రయివేట్ వ్యక్తులకు, సంస్థలకు లీజు ప్రాతిపదికన కట్టబెట్టే చర్యలను ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఆర్‌టిసి బస్టాండ్లను లీజు పేరుతో 33 సంవత్సరాలపాటు ప్రయివేట్ వ్యక్తులకు ఇవ్వాలని ఆలోచించడం సరికాదన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా మదనపల్లి ఆర్‌టిసి బస్టాండ్‌ను కాంట్రాక్ట్‌కు అప్పజెప్పి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. తర్వాత దీన్ని రాష్ట్రమంతా విస్తరించడానికి సిద్ధమవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్లను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని, అదేబాటలో రాష్ట్ర ప్రభుత్వమూ నడుస్తోందని విమర్శించారు. తక్షణమే ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పి బస్టాండ్లను మెరుగైన పద్ధతిలో నిర్వహణ ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఫారుక్ హుసేన్, పాల్గొన్నారు.

HEMADRI CEMENTS LIMITED
Address: Vedadri Village, Jaggaiahpet Mandal, Krishna Dist (A.P) - 521 457
Statement of Un-Audited Financial Results for the Quarter ended 31-12-2022
pursuant to Regulation 33 of SEBI (LODR) Regulations, 2015
CIN : L26942AP1981PLC002995

(Rs.in lakhs)

S.No.	Particulars	Three months' ended			Nine months ended		Year Ended
	Period Ending	31.12.22	30.09.22	31.12.21	31.12.22	31.12.21	31.3.2022
		Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Audited
1	Revenue from Operations	1,842.99	1,198.93	1,936.43	4,919.96	6,010.70	8,246.15
2	Other Operating Income	-	-	-	-		-
3	Other Income	33.93	3.38	17.19	67.22	93.28	174.64
	Total Income	1,876.92	1,202.31	1,953.62	4,987.18	6,103.98	8,420.79
4	Expenses						
	a) Cost of Material consumed	536.12	336.12	455.03	1,266.96	1,371.80	1,883.82
	b) Purchase of Stock-in-Trade	-	-	-	-	-	-
	c) Changes in inventories of finished goods,work-in-progress and stock -in- trade	(671.45)	278.10	22.62	(129.01)	11.80	(202.20)
	d) Power and Fuel	1,772.65	598.93	867.28	3,369.28	2,812.68	4,149.51
	e) Employee benefits expenses	141.65	142.96	162.09	426.34	455.85	615.44
	f) Finance costs	22.66	16.58	8.44	49.35	13.94	22.03
	g) Depreciation and amortisation expense	48.29	47.54	48.52	143.18	147.90	216.21
	h) Other Expenses	397.60	254.03	389.93	1,006.57	1,174.54	1,693.01
	Total Expenses	2,247.52	1,674.26	1,953.91	6,132.67	5,988.51	8,377.82
5	Profit Before Tax and Exceptional Items(3-4)	(370.60)	(471.95)	(0.29)	(1,145.49)	115.47	42.97
6	Exceptional items						
7	Profit Before Tax (5-6)	(370.60)	(471.95)	(0.29)	(1,145.49)	115.47	42.97
8	Tax Expense						
	Current Tax	-	-	1.82	-	34.02	16.02
	MAT credit	-	-	-		-	-
	Deferred Tax	-	-	(7.17)	-	2.21	(15.47)
	Excess Provision reversed	-	-	-		-	(0.07)
	Net Tax Expense / (Benefit)	-	-	(5.35)	-	36.22	0.48
9	Net Profit / (Loss) for the period	(370.60)	(471.95)	5.06	(1,145.49)	79.25	42.49
10	Other Comprehensive Income						
	(i)Items that will not be reclassified to Profit and Loss-		-	-	-	-	5.99
	ii) Income tax on above	-	-	-	-	-	1.55
	Other Comprehensive Income	-	-	-	-	-	4.44
11	Total Comprehensive Income (Comprising Profit and Other Comprehensive Income) (9+10)	(370.60)	(471.95)	5.06	(1,145.49)	79.25	46.93
	PAID UP CAPITAL (66,70,000 nos's of equity share of Rs 10/- each)	667.00	667.00	667.00	667.00	667.00	667.00
12	Earrings Per Share						
	(a) Basic	(5.56)	(7.08)	0.08	(17.17)	1.19	0.70
	(b) Diluted	(5.56)	(7.08)	0.08	(17.17)	1.19	0.70

Notes:
1. The Company's business operations comprises of a single segment viz., cement and materials
2. The Above Statement has been prepared to the extent applicable, in accordance with the Companies (Indian Accounting Standards) Rules, 2015 prescribed under Section 133 of the Companies Act, 2013 and Other recognised Accounting Practices and Policies adopted by the Company w.e.f 01.04.2018.
3. The above Un-Audited Results were reviewed by the Audit Committee and approved by the Board of Directors at their meeting held on 14.02.2023. The Statutory Auditors have carried out Limited Review of the above results
4. In view of losses in this nine months ended, Income tax/ Deferred tax provision is not considered and the same will be considered at the year end.
5. Previous period numbers have been regrouped wherever necessary.

Place : Chennai
Date : 14-02-2023

For Hemadri Cements Limited
Dr.Ananda Krishnan Balasubramaniyan
Managing Director
DIN- 02702557

నిందితుడు రాజుపై రౌడీషీట్

- మీడియా ముందుకు హాజరుపర్చిన పోలీసులు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తాడేపల్లిలో అంధ యువతి హత్య కేసు నిందితుడు నాగపోగు దయానందరాజు అలియాస్ కుక్కల రాజుపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. నిందితుడు దయానందరాజును తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మీడియా ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా జిందాల్, అడిషనల్ ఎస్‌పి సుప్రజ, డిఎస్‌పి రాంబాబు మాట్లాడారు. రాజు, ఎస్తేర్‌రాణి ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాధితురాలి పట్ల నిందితుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. ఈ విషయాన్ని ఎస్తేర్‌రాణి తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో రాజును నిలదీశారన్నారు. దీన్ని మనసులో పెట్టుకున్న నిందితుడు ఎస్తేర్‌రాణిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడని తెలిపారు. తీవ్రంగా గాయపడిన యువతిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతిచెందిందని వివరించారు. మద్యం మత్తులోనే రాజు ఈ హత్యకు పాల్పడ్డాడని, గతంలో ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. ఘటన జరిగిన వెంటనే రాజును అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు రాజుపై ఎలాంటి రౌడీషీట్ లేదని, నిందితుడిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సిఐ శేషగిరిరావు, ఎస్ఐలు వినోదకుమార్, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి రూ.2 లక్షలు ఆర్థిక సాయం

ఎన్‌టిఆర్ కట్టపై దారుణహత్యకు గురైన ఎస్తేర్‌రాణి కుటుంబానికి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రూ.2 లక్షల చెక్కును మంగళవారం స్థానిక తెలుగు మహిళల చేత అందజేశారు. ఎస్తేర్‌రాణి కుటుంబాన్ని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పరామర్శించి చెక్కును అందజేశారు.

బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా

- హోంమంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



తాడేపల్లిలో అంధ బాలిక దారుణ హత్య కేసులో నిందితుడిని గంటలోనే అరెస్టు చేశామని, సిఎం తక్షణమే స్పందించి ఆ బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారని హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. అమరావతి సచివాలయంలో ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడారు. తాడేపల్లిలో బాలికపై దాడిచేసి హత్య చేయడం పాశవిక చర్య అని అన్నారు. ఈ హత్యకు గంజాయి, మత్తు పదార్థాలు కారణం కావని, కేవలం వ్యక్తిగత కక్షలేనని వివరించారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టిడిపి హయాంలో మహిళలపై జరిగే ఆకృత్యాలకు హద్దే ఉండేది కాదన్నారు. మహిళలపై అఘాయిత్యాలు నివారించేందుకే దిశా యాప్‌ను తీసుకొచ్చామన్నారు. సమావేశంలో హోంసెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా, డిఐజి త్రివిక్రమ వర్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారిని దర్శించుకున్న హరీష్ రావు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని తెలంగాణ మంత్రి హరీష్ రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. విఐపి ప్రారంభ విరామదర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఏనుగుల దాడిలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - బలిజిపేట (విజయనగరం), పార్వతీపురం టౌన్

ఏనుగుల దాడిలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన విజయనగరం బలిజిపేట మండలంలోని శివరాంపురం పంచాయతీ చెల్లంపేటలో మంగళవారం జరిగింది. ఎస్ఐ ఎన్ ప్రశాంత్ తెలిపిన వివరాలు ప్రకారం... అడపా దేశి నాయుడు (70) ఉదయం ఐదు గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకోడానికి ఊరు బయటకు వెళ్లారు. ఏనుగుల గుంపు ఒక్కసారి అటువైపుగా వచ్చి అయనను చుట్టుముట్టింది. వాటి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఒక ఏనుగు వెనుకవైపు నుంచి తొండంతో ఆయనను వెనక్కిలాగి కాళ్లతో తొక్కేసింది. దీంతో దేశీ నాయుడు అక్కడికక్కడే మృతి చెందారు.

రూ 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

పార్వతీపురంటౌన్ : ప్రజల ప్రాణాలు తీస్తున్న, పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును తక్షణమే అటవీ అధికారులు తరలించాలని, ఏనుగుల దాడిలో మృతి చెందిన వృద్ధుని కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో, ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు.

ఫోర్డ్‌లో వేలాది ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్ : బహుళజాతి కార్ల తయారీ కంపెనీ ఫోర్డ్ తమ వేలాది మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. వచ్చే మూడేళ్లలో యూరప్‌లో 3,800 మంది ఉద్యోగులుపై వేటు వేయనున్నట్లు పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, మార్కెట్‌లో విద్యుత్ కార్ల డిమాండ్ నేపథ్యంలో వ్యయాలను తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నామని ఆ కంపెనీ వెల్లడించింది. ఈ క్రమంలోనే జర్మనీలో 2,300 మందిని, బ్రిటన్‌లో 200 మందిని ఇంటికి పంపించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం యూరప్‌లో మొత్తం 34,000 మంది ఉద్యోగులు ఉన్నారు. 2035 నాటికల్లా యూరప్ అంతటా విద్యుత్ కార్లను అమ్మాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆ కంపెనీ ప్రకటించింది. ప్రస్తుత ఏడాదిలోనే కంపెనీ ఐరోపాలో తయారు చేసిన తొలి విద్యుత్ కారును విడుదల చేయనున్నట్లు పేర్కొంది. ఆర్థికంగా సవాళ్లు నెలకొన్న నేపథ్యంలో కంపెనీ కార్యకలాపాలను గాడిలో పెట్టే ఉద్దేశ్యంతోనే ఉద్యోగుల కోత నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇందుకోసం సాధ్యమయినంత వరకు స్వచ్ఛంద విరమణ కార్యక్రమాన్ని తీసుకోనున్నామని తెలిపింది.

లింక్డిన్‌లోనూ ఉద్యోగుల తొలగింపులు..!

ముంబయి : సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లింక్డిన్‌లోనూ ఉద్యోగుల కోత మొదలయ్యిందని తెలుస్తోంది. నియామక శాఖలోని ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు సమాచారం. కాగా.. ఎంత మందిని తొలగించేది ఆ సంస్థ వెల్లడించలేదు. 2023 ప్రారంభంలో టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించిన ఈ సంస్థ ఇప్పుడు తిరిగి ఉద్వాసనలకు పాల్పడటం ఆందోళనకరం. దీనికి సంబంధించి లింక్డిన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.

హాయర్ నుంచి కొత్త ఎసిలు

న్యూఢిల్లీ : గృహోపకరణాలు, వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ హయ్యర్ కొత్తగా కినోచి 5స్టార్ హెవీ డ్యూటీ ప్రో ఎయిర్ కండీషనర్ సిరీస్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ సీరిస్ ఎసిలు సూపర్ కూలింగ్ ఫీచర్‌తో శక్తిమంతమైన పనితీరును అందిస్తాయని పేర్కొంది. ఇవి 65 శాతం శక్తిని పొదుపు చేస్తాయని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. హయర్ రూ.14990 విలువైన 5 సంవత్సరాల వారంటీ, రూ.4000 వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లు, రూ.1500 విలువైన ఉచిత ఇన్‌స్టాలేషన్, జీవితకాల కంప్రెసర్ వారంటీ ఉందని పేర్కొంది.

ఇన్సూరెన్స్ దేఖోకు రూ.1240 కోట్ల నిధులు

హైదరాబాద్ : దేశీయ బీమా టెక్ కంపెనీ 'ఇన్సూరెన్స్ దేఖో' తొలిసారి భారీ నిధులను సమీకరించింది. ఈ సంస్థ సిరీస్ ఎ ఫండింగ్‌లో 150 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1,240 కోట్ల)ను నిధులను సేకరించినట్లు ప్రకటించింది. ఈక్విటీ రౌండ్‌లో ముందంజలో ఉన్న గోల్డ్ మన్ శాక్స్ అసెట్ మేనేజ్‌మెంట్, టివిఎస్ క్యాపిటల్ ఫండ్స్, ఇన్వెస్ట్ కార్ప్, అవతార్ వెంచర్స్, లీప్ ఫ్రాగ్ ఇన్వెస్ట్ మెంట్స్ తదితర సంస్థలు నిధులు అందించిన వాటిలో ఉన్నాయి. 2016లో అంకిత్ అగర్వాల్, ఈష్ బబ్బర్ కలిసి ఇన్సూరెన్స్ దేఖోను ఏర్పాటు చేశారు. ప్రారంభించినప్పటి నుంచి ఈ కంపెనీ గణనీయమైన ప్రీమియం వృద్ధిని నమోదు చేస్తుంది. 2023 మార్చి నాటికి వార్షిక ప్రీమియం రూ.3,500 కోట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇన్సూరెన్స్ దేఖో సిఇఒ కోఫౌండర్ అంకిత్ అగర్వాల్ పేర్కొన్నారు.

వెస్టెండ్ హౌసింగ్ ఫైనాన్స్ ఛైర్మన్‌గా జగదీష్ కపూర్



ముంబయి : గృహ రుణాలు జారీ చేసే వెస్టెండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఛైర్మన్‌గా జగదీష్ కపూర్ నియమితులయ్యారు. ముంబయిలో జరిగిన ఆ కంపెనీ బోర్డు భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జగదీష్ కపూర్ ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్‌గా సేవలు అందించారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు, బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీకి ఛైర్మన్‌గా పని చేసిన అనుభవం ఉంది. పలు ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంక్‌ల బోర్డుల్లోనూ సేవలు అందించారు.

సంపాదకీయం

ఈ నెల 16న జరుగనున్న త్రిపుర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పెద్ద ఎత్తున హింస చెలరేగవచ్చునన్న భయకంపిత వాతావరణం నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం 36 లక్షల జనాభాగల ఈశాన్య సరిహద్దు రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడడంపట్ల ప్రజాతంత్రవాదులు కలత చెందుతున్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల సందర్భంగా బందోబస్తుకు ఆ రాష్ట్ర పోలీసులకు అదనంగా ఇతర ఈశాన్య రాష్ట్రాలవారిని, పారా మిలిటరీని ఉపయోగించేవారు. ఈ ఎన్నికల్లో ఎక్కడో ఉన్న గుజరాత్ నుండి పోలీసులను తీసుకురావడం పలు అనుమానాలకు తావిస్తున్నది. బిజెపి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నెల 11 రాత్రి ఆ రాష్ట్ర డిజిపితో సహా పోలీసు ఉన్నతాధికారులతో రహస్యంగా సమావేశమవ్వడం ప్రజల భయాందోళనలను మరింతగా పెంచింది. తమ పార్టీ ప్రచారానికి వెళ్లిన పెద్దమనిషి ఆ పని పూర్తి చేసుకోవాలి తప్ప అధికారులతో సమావేశాలెలా జరుపుతారు? ఎన్నికల కోడ్ చెబుతున్నదేమిటి? ఇవేవీ అమిత్ షా కు తెలియకపోవు. అయినా ఉన్నతాధికారులు బిజెపి కి అనుకూలంగా వ్యవహరించాలని చెప్పడానికే ఆ సమావేశం అన్నది బహిరంగ రహస్యం. నిజాయితీకలిగి, రాజ్యాంగానికి, చట్టానికి లోబడి వ్యవహరించే వారెవరైనా ఉంటే వారిని బెదిరించడమో లేక ప్రలోభపర్చడమూ జరగవచ్చు. మొత్తం వ్యవహారాలు చూస్తుంటే త్రిపుర ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలోని తన అధికారాన్ని బిజెపి నిస్సిగ్గుగా ఉపయోగిస్తోందన్నది సుస్పష్టం.

స్వేచ్ఛగా ఎన్నికలు..!

ఇటీవల త్రిపురలోకి పెద్ద సంఖ్యలో మోటార్ సైకిళ్లు దిగుమతి అయ్యాయి. ఆ మోటార్ సైకిళ్లను నడుపుతూ కిరాయి మూకలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ప్రయత్నిస్తాయి. తద్వారా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లను బిజెపి భయపెడుతుంది. ఓటర్లను ప్రభావితం చేయడానికి ఇతర బెదిరింపు పద్ధతులు కూడా ఉపయోగిస్తున్నారు. ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన బిజెపి త్రిపురలో శాంతి భద్రతలను విచ్ఛిన్నం చేసింది. సిపిఎం నాయకులు, కార్యకర్తలపై తీవ్ర నిర్బంధకాండ సాగించింది. 2018 నుండి 2021 మధ్య 667 వామపక్ష పార్టీల కార్యాలయాలను బిజెపి ముష్కరులు ధ్వంసం చేశారు. గత సెప్టెంబర్ 7, 8 తేదీల్లోనే 42 సిపిఎం కార్యాలయాలను తగులబెట్టారు. సిపిఎం సభ్యులకు చెందిన 3363 ఇళ్లు, 1500 చేపల కుంటలను ధ్వంసం చేశారు. ఇంతటి విధ్వంసం జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారేతప్ప దుండగులను కనీసం అదుపులోకి కూడా తీసుకోకపోవడం అధికార పార్టీ ఆగడాలకు నిదర్శనం. అక్రమాలకు అలవాటుపడ్డ బిజెపి ఈ ఎన్నికలను తొత్తడం చేయాలని అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. వామపక్షాలు 47 స్థానాల్లోను, మిగిలిన 13 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తున్నాయి. బిజెపిని ఓడించాలన్న లక్ష్యంతో పరస్పర పోటీ నివారణ ఒడంబడిక జరిగింది. మరోవైపున తిప్రా మోర్చా కూడా పోటీలో ఉంది. కొన్ని చోట్ల త్రిముఖం, ఇంకొన్ని చోట్ల బహుముఖ పోటీ జరిగే పరిస్థితి ఏర్పడింది. దాంతో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేస్తే బిజెపి ఓడిపోవడం ఖాయమని తేలిపోయిన నేపథ్యంలో ఎన్నికల అక్రమాలకు ఆ పార్టీ నేతలు యత్నిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో, శాంతియుతమైన, సానుకూలమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ సకల చర్యలు చేపట్టాలి. భారత రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు విశేషాధికారాలను కల్పించింది. వాటిని ఉపయోగించి ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. పోలీసు, పారా మిలిటరీ బలగాలు నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చూడాలి. ఫ్లాగ్ మార్చ్‌లతో సహా ప్రజల్లో విశ్వాస పునరుద్ధరణ చర్యలు తీసుకోవడం అవసరం. ఫ్లాగ్ మార్చ్‌లు ప్రధాన రహదారులకు మాత్రమే పరిమితం కాకుండా మారుమూల ప్రాంతాల్లో కూడా చేపట్టాలి. అధికార పార్టీ అక్రమాలపై ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు సిపిఎం, ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రతినిధి బృందాలు కలిసి ప్రత్యక్షంగా తెలియజేయడం, లేఖలు రాయడం జరుగుతోంది. ఎన్నికలు శాంతియుతంగా నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటామని ఆయా సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులూ హామీ ఇస్తున్నారు. అయితే, ఆచరణ ఎలా ఉంటుందో గురువారంనాడు తెలుస్తుంది.

మహనీయుని మాట



ప్రపంచంలో ఎక్కడ అపద ఉన్నా స్పందించడానికి సిద్ధంగా ఉండు.
- చే గువేరా



పథకం ప్రకారమే ఛత్తీస్‌గఢ్‌లో క్రైస్తవులపై దాడి

విశ్లేషణ



బృందా కరత్

బక్కపల్చటి శరీరం, చారెడంత గోధుమ రంగు కళ్లు వున్న ఆమె...చేతుల మీది గాయాలు కనిపించకుండా శాలువా చుట్టుకుంది. గొంతు మృదువుగా ఉన్నప్పటికీ మనుగడ కోసం చేసిన పోరాటాల లోంచి వచ్చిన గంభీరత ఆమె స్వరంలో ధ్వనించింది. ఆమె ఇలా చెప్పింది. "మా గ్రామం (రామావంద్) లోని సంస్కృత భవన్‌లో సమావేశాలు జరిగేవి. ఆదివారం ప్రార్థనలకు వెళ్లవద్దని అక్కడ హెచ్చరించారు. డిసెంబర్ 27న నా భర్తను బైటకు లాగి కొట్టడం మొదలుపెట్టారు. తనను ఫుట్‌బాల్ మాదిరిగా అందరూ వంతులవారీగా తన్నారు. గ్రామ పెద్దలకు బంధువులైన ఆరుగురు మహిళలు నన్ను ఒడిసి పట్టుకున్నారు. మగవాళ్ళు నన్ను నోటికొచ్చినట్లు తిడుతూ, నాకు గుణపాఠం నేర్పమని వారికి చెప్పారు. నా జుట్టు పట్టుకుని పీకారు. నా తల మీద పదే పదే కొట్టారు. అంటితో ఆగక తలను నేలకేసి కొట్టారు. ఈ ఘర్షణలో నా జాకెట్ చిరిగిపోయింది. మా గ్రామంలో క్రీస్తును నమ్మిన పదకొండు మంది మహిళలు, ఒక యువకుడితో సహా అందరూ ఇలాంటి హింసను ఎదుర్కొన్నారు. మీరు ప్రశాంతంగా బతకాలనుకుంటే మా సమాజానికి తిరిగి రండి ('ఘర్ వాపస్') అన్నారు. నేను ఎలాంటి తప్పు చేయలేదు. ప్రార్థనలు మాత్రమే చేశానన్నాను".

ఆమెకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైంది. కానీ ఎటువంటి చర్య తీసుకోలేదు.

ఉత్తర బస్తర్ లోని కంకేర్, కొండగావ్, నారాయణపూర్ జిల్లాల్లోని క్రైస్తవ సమాజానికి చెందిన 500 ఆదివాసీ కుటుంబాలలో ఆమె కుటుంబం కూడా వుంది. ఛత్తీస్‌గఢ్‌లో, గత ఏడాది అక్టోబర్ నుంచి తమపై జరిగిన మూకుమ్మడి దాడుల కారణంగా వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రతినిధి బృందంతో కలిసి ఇటీవల బాధిత ప్రాంతాలకు వెళ్లినప్పుడు మహిళల మీద జరిగిన అత్యంత క్రూరమైన దాడుల గురించి చాలా తక్కువగా పేర్కొన్నారు. డిసెంబరులో 1,500 మంది ప్రజలు తమ ఇళ్లను విడిచిపెట్టి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాలు, చర్చిలు, బంధువులు-స్నేహితుల ఇళ్లలో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. 200 మందికి పైగా ఇప్పటికీ తిరిగి స్వగ్రామాలకు రాలేకపోయారు. నారాయణపూర్ లోని ప్రధాన చర్చి, "ప్రార్థన గదులు"తో సహా ఇతర జిల్లాల్లోని చర్చిలను ధ్వంసం చేశారు. కొన్ని చోట్ల దగ్ధం చేశారు. ఇళ్లను పగలగొట్టి దోచుకున్నారు. నారాయణపూర్ చర్చిపై దాడి కేసుకు సంబంధించి అరెస్టయిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షుడు, ఇతర స్థానిక నాయకులు ఉన్నారు.

మత మార్పిళ్లకు వ్యతిరేకంగా బజరంగ్‌దళ్, విహెచ్‌పి వంటి ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల నేతృత్వంలోని "ఘర్ వాపసీ" ప్రచారం కొత్తదేమీ కాదు. తేడా ఏమిటంటే ఈసారి 'జన్ జాతి సురక్షా మంచ్' (జెఎస్ఎం) వంటి వేదికలను సృష్టించడం ద్వారా, మత మార్పిళ్ల నుంచి తమ సంప్రదాయాలను రక్షించుకోడానికి ఆదివాసీలు స్వయంగా లేవనెత్తిన ఒక ఆకస్మిక ఉద్యమంగా దీనిని చూపించారు. అయితే ఇది అలాంటిది కాదు.

నవంబర్ మొదటి వారంలో, జెఎస్ఎం చేసిన నిరసన ప్రదర్శనకు ఆ ప్రాంతానికి చెందిన మాజీ బిజెపి ఎమ్మెల్యే, గిరిజన నేత నాయకత్వం వహించారు. కామెర్ల వ్యాధితో మరణించిన 55 ఏళ్ల ఆదివాసీ క్రైస్తవ మహిళ చైతీ బాయి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో పూడ్చిపెట్టాలని డిమాండ్ చేస్తూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. గ్రామంలో ఒక క్రైస్తవుని ఖననం చేయడం 'గ్రామ దేవతకు కోపం తెప్పిస్తుంది. గ్రామాన్ని నాశనం చేస్తుంది' అని చెప్పుకొచ్చాడు. చైతీ బాయి కుటుంబానికి ఎంతగా బెదిరింపులు వచ్చాయంటే...వారు గ్రామం విడిచి వెళ్లిపోయేంతగా. మరుసటి రోజు రాత్రి అతని అనుచరులు సమాధిని తవ్వి ఆమె మృతదేహాన్ని బయటకు లాగారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన, అనాగరికమైన చర్యపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా మృతదేహాన్ని తీసుకెళ్లి 100 కిలోమీటర్ల దూరంలోని క్రైస్తవ శ్మశానవాటికలో పాతిపెట్టింది. దీంతో జెఎస్ఎం ఇటువంటి మరిన్ని చర్యలకు పాల్పడేందుకు ఊతమిచ్చినట్లయింది. దాంతో క్రైస్తవుల మీద హింసాత్మక దాడులు మరింత పెరిగాయి.



నవంబర్ మొదటి వారంలో, జెఎస్ఎం చేసిన నిరసన ప్రదర్శనకు ఆ ప్రాంతానికి చెందిన మాజీ బిజెపి ఎమ్మెల్యే, గిరిజన నేత నాయకత్వం వహించారు. కామెర్ల వ్యాధితో మరణించిన 55 ఏళ్ల ఆదివాసీ క్రైస్తవ మహిళ చైతీ బాయి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో పూడ్చిపెట్టాలని డిమాండ్ చేస్తూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. గ్రామంలో ఒక క్రైస్తవుని ఖననం చేయడం 'గ్రామ దేవతకు కోపం తెప్పిస్తుంది. గ్రామాన్ని నాశనం చేస్తుంది' అని చెప్పుకొచ్చాడు. చైతీ బాయి కుటుంబానికి ఎంతగా బెదిరింపులు వచ్చాయంటే...వారు గ్రామం విడిచి వెళ్లిపోయేంతగా. మరుసటి రోజు రాత్రి అతని అనుచరులు సమాధిని తవ్వి ఆమె మృతదేహాన్ని బయటకు లాగారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన, అనాగరికమైన చర్యపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇలాంటి చర్యలకు ఆదివాసీ సంస్కృతుల రక్షణకు ఎటువంటి సంబంధం లేదు. చనిపోయినవారిని ఆదివాసీలు పాతిపెడతారు. చనిపోయినవారిని క్రైస్తవులు తమ స్వంత భూమిలో పాతిపెట్టినప్పుడు...భారతదేశంలో ఆదివాసీలు నివసించే ఏ ప్రాంతంలోనూ సమస్య కాలేదు. ఇది ఆదివాసీ సంస్కృతులను హిందుత్వీకరించేందుకు తయారు చేసిన ఎజెండా మాదిరిగా కనిపిస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో 2006లో అప్పటి బిజెపి ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిళ్లకు వ్యతిరేకంగా ఒక చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే ప్రస్తుతం మత మార్పిళ్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా... బలవంతంగా మత మార్పిడి చేసినట్లుగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మనస్సాక్షి స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన హక్కుపై దాడి జరుగుతోంది.

ఆదివాసీ ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించ బడుతున్నాయి. కీర్తనలు, భజన మండళ్లు నిర్వహించ బడుతున్నాయి. ఆదివాసీ విశ్వాసాలు, సంస్కృతులకు దూరంగా విగ్రహారాధనకు అనుసంధానించబడిన ఆచారాలు బహిరంగంగా ప్రచారం చేయబడుతున్నాయి. ఆదివాసీ సంప్రదాయాల దృష్టి కోణం నుండి చూసినట్లయితే వాటిని వారి మీద రుద్దినట్టుగా పరిగణించవచ్చు. మత మార్పిడికి ఏర్పాటు చేసినట్టు భావించవచ్చు. ఆదివాసీల లోని క్రైస్తవ విశ్వాసులను "ఇంటికి తిరిగి" రమ్మని బెదిరించినప్పుడు, ఏ ఇంటిని సూచిస్తారు? ఇతర మతాల నుండి వేరుగా ఉన్న ఆదివాసీల నమ్మకాలు, విశ్వాసాలను సూచించడానికి వీలుగా జనగణన పత్రంలో "సర్నా/ఆదివాసి" కాలమ్‌ను జోడించాలన్న తీర్మానాన్ని జార్ఖండ్ లోని జెఎంఎం ప్రభుత్వం నేతృత్వంలోని అసెంబ్లీ ఆమోదించింది.

రెండు ఇనుప ఖనిజం ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నారాయణపూర్ లోని ఆదివాసీలు పోరాడుతున్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా గ్రామసభల అనుమతి లేకుండానే ఈ ప్రాజెక్టులను తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు నిలిపివేసిన ఒడిశా నియమ్‌గిరి ప్రాజెక్టు మాదిరిగానే...ఈ ప్రాజెక్టులు ఆదివాసీలు పవిత్రమైనవిగా భావించే ప్రాంతాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. దీనిపై జన్ జాతి సురక్షా మంచ్ మౌనంగా ఉంది. ఘర్ వాపసీ ప్రచారం ద్వారా...గ్రామసభ అనుమతి లేకుండా గ్రామాల్లోకి క్రైస్తవ పాస్టర్ల ప్రవేశాన్ని నిషేధించే తీర్మానాలను ఆమోదిస్తున్నారు. తద్వారా గ్రామసభ హక్కును వక్రీకరిస్తున్నారు.

ఈ ఏడాది చివర్లో రాష్ట్ర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో...ప్రజల మధ్య చీలికలు సృష్టించి లబ్ధి పొందాలన్న బిజెపి సహజమైన వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఒక్క మంత్రిని కూడా పంపని, ఒక్క బాధిత కుటుంబానికి కూడా నష్టపరిహారం అందించని కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఏం చెప్పాలి?

చర్చిపై రాళ్ల దాడిలో ఒక పోలీసు అధికారి గాయపడిన తర్వాత మాత్రమే అరెస్టులు జరిగాయి. మహిళలతో సహా బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా, కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా వారెవరినీ అరెస్టు చేయలేదు. నారాయణపూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా. సరిగ్గా బాధితులకు అత్యవసరమైన సందర్భాలలో ఆయన కనిపించకుండా తప్పుకున్నారు. భారత దేశాన్ని ఏకం చేసే మార్గం ఇదేనా?

(వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు)
/'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో/

కవిత్వం

వృథాభరితం వృద్ధాప్యం

జీవన సంధ్యా సమయంలో
వృద్ధాప్యం అంతులేని ఘర్షణలకు
ఆవేదనలకు నిలయం
వృద్ధాప్యం శాపం కాదు
అది అనుభవాల ఆస్తి నైపుణ్యాల నిధి
పెద్దరికం నవతరంతో
నగుబాట్లకు గురౌతున్నది
కోటి ఆశలతో ఆకాంక్షలతో కనిపెంచిన
తల్లితండ్రులకు జీవిత మలిదశలో
కష్టాలే కానుకలైనాయి
అవమానాలే అభినందనలైనాయి
ఈసడింపులే పలకరింపులైనాయి
సూటి పోటి మాటలే
వారి పాలిట ఆత్మీయ స్పర్శ అయ్యింది
నిరంతరం శ్రమించిన
త్యాగమూర్తులకు గుక్కెడు
గంజి మెతుకులు కరువైనాయి
ఆత్మీయత కరువై
ఒంటరి తనం ఆస్తి అయ్యింది
నిరాశే తోడు నీడైంది
జవసత్వాలు ఉడిగి వృద్ధాప్యపు బోటుకు
నిరాకరణ నిరాదరణ అనే
చిల్లులు పడ్డాయి
కరుణ కరువై కాఠిన్యం బరువై
కష్టాలే శరణ్యమై అనారోగ్యమే సంపదై
కలలన్నీ కన్నీరై ఆశలన్నీ ఆవిరై
జీవితం మలిదశలో ఆపన్న హస్తం కోసం
ఎదురుచూస్తున్న వృద్ధులను ఆదరిద్దాం
వృద్ధులు వద్దు ఆస్తులే ముద్దు అనే
వైఖరి విడనాడాలి
మానవీయ విలువలతో
సంస్కారంతో "పెద్దరికానికి"
"పెద్ద పీట" వేయాలి
వృద్ధులను కంటికి
రెప్పలా కాపాడుకోవాలి.

- నేదునూరి కనకయ్య,
సెల్ : 9440245771

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

సత్యంతోనే సమాజ పురోగమనం

సందర్భం

ఎన్. వెంకటేశ్వర్లు

సత్యం చెప్పడం అంత సులభం కాదు. ఉన్న విషయాన్నే చెబుతున్నాం కదా అనుకుంటాం. కానీ, ఆ సత్యం పాలకులకు నచ్చకపోతే, సత్యం పలికిన వారికి, సత్యం కోసం నిలబడిన వారికి కష్టాలు తప్పవు. అటువంటి ఉదంతాలు చరిత్రలో ఎన్నో నమోదయ్యాయి. ప్రాణం పోతున్నా సత్యం కోసం నిలబడి మృత్యువు ముఖంపై చిరునవ్వుతో సంతకం చేసిన వారెందరో ఉన్నారు. అటువంటి వారు చరిత్రలో చిరస్థాయిగా నిలబడ్డారు.

నిజం కోసం నిలబడ్డవారు...

నమ్మకాలు కాదు నిరూపణలు కావాలని, వాస్తవ విషయాలు ప్రచారం చేసి, నమ్మకాలను ప్రశ్నించినందుకు చార్వాకులను భౌతికంగా తుదముట్టించారు. ప్రాణాలు తీస్తున్నా...వారు సత్యం కోసం ప్రచారం చేయడం ఆపలేదు. ఈ సమస్త విశ్వం ప్రకృతి సూత్రాల మీదే ఆధారపడుతుందని వారు నిరూపించారు. రాక్షసులని ప్రచారం చేసినా ఎక్కడా రాజీ పడలేదు, భయపడలేదు. అందుకే చార్వాకులు భారతదేశ మొదటి భౌతికవాదులుగా చిరస్థాయిగా నిలిచిపోయారు. వారు చెప్పిన సత్యం నేటికీ వాస్తవంగానే ఉంది. ఎవరికో ఇచ్చ కలగటం...మానవుడు, భూమి, సమస్త ప్రపంచం ఏర్పడిందని, ఇప్పుడున్న ఈ రూపం లోనే మనిషి ఉద్భవించాడని, తన కష్టాలకు, సుఖాలకు, జ్ఞానం, చైతన్యం అంతా తన చేతుల్లో ఏమీ లేదని చెప్పే నమ్మకాలకు భిన్నంగా పరిసరానుగుణ్యతను, పరిణామవాదాన్ని డార్విన్ నిరూపణలతో సహా నిరూపించారు. పరిసరాలకు అనుగుణంగా తన శరీర నిర్మాణాన్ని, ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చుకోగలిగిన జీవులు అభివృద్ధి చెందుతూ వస్తాయని, నిటారుగా నిలబడటానికి మనిషి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడని శాస్త్రీయంగా నిరూపించినా ఆ రోజు నమ్మకాల పేరుతో అంగీకరించలేదు. కానీ ఇదే సత్యమని నిరూపితమైంది. ఈ మాట చెప్పినందుకు డార్విన్‌ని హింసించారు. జైలు పాలు చేశారు. కోర్టుల చుట్టూ తిప్పారు. అవహేళనకు గురిచేశారు. అయినా డార్విన్ సత్యం కోసం నిలబడ్డాడు.

సత్యాన్వేషణ కోసం ఎన్ని కష్టాలో..!

సత్యాన్వేషణకు హేతువు, తర్కం ప్రధాన సూత్రాలని- నమ్మకం కాదని కోపర్నికస్, బ్రూనోలు ఎలుగెత్తి చాటారు. భూమి కేంద్రంగా సమస్త విశ్వం తిరుగుతుందని చెప్పే నమ్మకం తప్పని, సూర్యకేంద్ర సిద్ధాంతం వాస్తవమని, సూర్యుడు నక్షత్రం మాత్రమేనని, దీని చుట్టూ విశ్వం తిరుగుతుందని చెప్పినందుకు కోపర్నికస్ మత పెద్దల నుండి అనేక ఆంక్షలు ఎదుర్కొన్నాడు. సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నందుకు బ్రూనే కు మతపెద్దలే 8 సంవత్సరాలపాటు అత్యంత దారుణ పద్ధతిలో కఠిన కారాగార శిక్ష విధించారు. అప్పటికీ ఆయనలో మార్పు రాకపోవడంతో ఇటలీ వీధుల్లో సజీవ దహనం చేశారు. 1600 సంవత్సరం ఫిబ్రవరి 17 ఇటలీ వీధుల్లో ప్రజలందరి సమక్షంలో అత్యంత కిరాతకంగా బ్రూనేని సజీవ దహనం చేయటానికి ఒక క్షణం ముందు... ఇప్పటికైనా భూకేంద్ర సిద్ధాంతమే వాస్తవం అని చెప్పి నీ ప్రాణాల్ని దక్కించుకోమని చెప్పిన పాలకులకు... "నన్ను భౌతికంగా దహనం చేసినా నిజం ఎప్పటికైనా నిజంగానే నిరూపితం అవుతుంది" అని బదులిచ్చాడు. బ్రూనో మరణం జ్ఞాన సమపార్జనకు, సత్యాన్వేషణకు, హేతుబద్ధ ఆలోచనలకు గొప్ప పునాదిని వేసింది. ఆధునిక భౌతిక శాస్త్రం, సమాజం వేగంగా అభివృద్ధి చెందటానికి బాటలు వేసింది.

ప్రపంచ ఖగోళ వింతల్ని చూడటం కోసం తన జీవితాంతం కృషి చేసి, గెలీలియో టెలిస్కోప్‌ని కనుగొన్నాడు. సూర్యుడు చుట్టూ గ్రహాలన్నీ తిరుగుతాయని చెప్పినందుకు



తమకు తెలియని కాలంలో మానవ సమాజం కొన్ని నమ్మకాలను, విశ్వాసాలను తయారు చేసుకుని ఉండవచ్చు. కాలక్రమంలో పరిశీలన వల్ల, ప్రయోగాల వల్ల ఆ నమ్మకాలు, విశ్వాసాలు తప్పని నిరూపించారు. రుజువైన సత్యాన్ని... విశ్వాసాలు, నమ్మకాల పేరుతో తిరస్కరించే శక్తులు అప్పుడు, ఇప్పుడు, భవిష్యత్తులోనూ ఉంటాయి. వాటిని ఎదుర్కొని సత్యాన్ని ముందుకు తీసుకుపోవాలి. 1600లో బ్రూనోని సజీవ దహనం చేసిన ఇటలీ పాలకులు 1889లో తమ తప్పు తెలుసుకుని సత్యమే గెలుస్తుంది అని బ్రూనో స్థూపాన్ని నిర్మించారు.

ఫిబ్రవరి 17 సత్యాన్వేషణా దినోత్సవం

పాలకవర్గం ఆయనకు యావజ్జీవ శిక్ష వేసింది. యావజ్జీవ శిక్ష కాలంలోనే గుడ్డివాడయ్యాడు. కారాగారంలోనే చనిపోయాడు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి, ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొన్నది.

మనిషి ఈ రూపంలో రావటానికి, నిటారుగా నిలబడడం కోసం శ్రమ కీలమని చెప్పిన సామాజిక తత్వవేత్తలు కారల్ మార్క్స్, ఏంగెల్స్. వీరిని నాటి నుండి నేటి వరకు కొందరు తూలనాడుతూనే ఉన్నారు. వ్యంగ్య విమర్శలు చేస్తూనే ఉన్నారు. వారు చెప్పింది నిజమని నిరూపితమైన తర్వాత కూడా అంగీకరించడానికి నిరాకరించేవారు ఉన్నారు.

విప్లవ వీరులది సత్యం బాటే...

చేగువేరా, ఫైడల్ కాస్ట్రో, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి ఎందరో తాము నమ్మిన సిద్ధాంతం కోసం, సత్యాన్ని ప్రచారం చేయటం కోసం తమ ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించారు. "ఏ క్షణాన మరణం సంభవించినా, నేను దాన్ని ఆహ్వానిస్తాను. కానీ ఒక్క మాట. ఈ యుద్ధభేరి మరో చెవికి వినిపించాలి. నా చేతి లోని ఆయుధం మరో చేతిని అందుకోవాలి. సామాజిక బాధ్యత బరువు అనుకుంటే, ఉద్యమాలు మనకెందుకులే అనుకుంటే బానిసగా బతికేందుకు సిద్ధపడాలి. నా ఒక్కడి వల్లే దేశం మారిపోతుందా... అనుకునే ఏ ఒక్కడి వల్లా ఈ దేశానికి ఉపయోగం లేదు" అంటాడు చేగువేరా. "మనుషులను చంపగలరేమోగానీ, వారి ఆశయాలను మాత్రం చంపలేరు. సత్యం కోసం చనిపోయిన వారు ఎల్లకాలం బతికే ఉంటారు" అని భగత్ సింగ్ చెప్పాడు.

నాడే కాదు... నేడు కూడా..

నాడే కాదు నేడు కూడా నిజాలు చెప్పిన వారిని, సత్యం కోసం నిలబడిన వారిని భౌతికంగా హతమార్చిన లేదా మానసికంగా హింసిస్తున్న సందర్భాలు ఉన్నాయి. నిజ జీవితానికి అత్యంత దగ్గరగా పాలకవర్గాల నిజస్వరూపాన్ని కళ్లకు కట్టినట్లు పాటల ద్వారా, చిన్న చిన్న వీధి నాటకాల ద్వారా ప్రజా కళ కోసం జీవితాన్ని అంకితం చేసిన హష్మీని ఢిల్లీ నడివీధిలో అత్యంత కిరాతకంగా హత్య చేశారు. సమాజాభివృద్ధికి శాస్త్రీయ విజ్ఞానం అవసరమని, మూఢ నమ్మకాలు లేని సమాజాన్ని ఆవిష్కరించటానికి రాష్ట్రమంతా తిరిగి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ విషయాలను, శాస్త్రీయ అంశాలను సమాజానికి అర్థమయ్యేటట్లు ధబోల్కర్ బోధించారు. మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టాన్ని తీసుకురావాలని ప్రజలను చైతన్యం చేయడానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో ఆయన్ను మతోన్మాదులు అత్యంత కిరాతకంగా చంపేశారు. చరిత్ర అంటే ఊహాగానాలు కాదని, పరిశోధనల ద్వారా నిరూపితమైన వాస్తవమైన చరిత్రేనని, వక్రీకరించిన చరిత్రలను కాదని వాస్తవ చరిత్రను చెప్పటానికి ప్రయత్నం చేసిన కల్బుర్గిని ఇంట్లోనే తుపాకి గుళ్లకు బలిచేశారు. దేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల వల్ల సమాజం అభివృద్ధి చెందడం లేదని, ఈ అసమానతలను రూపుమాపటానికి నిరంతరం గోవింద్ పన్సారే కృషి చేశారు. అసమానతలను రూపుమాపటానికి చేసిన కృషిని జీర్ణించుకోలేని వారు అత్యంత కిరాతకంగా గోవింద్ పన్సారేని చంపేసారు. ఈ దేశం అందరిది అని, సమాజంలోని సంపద అందరి సమిష్టి కృషి వల్ల ఉత్పత్తి అవుతుందని, భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశమని గౌరీ లంకేష్ ప్రచారం చేశారు. వివిధ రకాల మతాలు, కులాలు, సంస్కృతులు ఉన్న భారత దేశంలో మతతత్వ ఆలోచనలను ప్రచారం చేయటాన్ని వ్యతిరేకించారు. ఇలా మతతత్వాన్ని వ్యతిరేకించడంతో గౌరీ లంకేష్‌ని చంపేశారు.

సత్యమే గెలుస్తుంది

తమకు తెలియని కాలంలో మానవ సమాజం కొన్ని నమ్మకాలను విశ్వాసాలను తయారు చేసుకుని ఉండవచ్చు. కాలక్రమంలో పరిశీలన వల్ల, ప్రయోగాల వల్ల ఆ నమ్మకాలు, విశ్వాసాలు తప్పని నిరూపించారు. రుజువైన సత్యాన్ని... విశ్వాసాలు, నమ్మకాల పేరుతో తిరస్కరించే శక్తులు అప్పుడు, ఇప్పుడు, భవిష్యత్తులోనూ ఉంటాయి. వాటిని ఎదుర్కొని సత్యాన్ని ముందుకు తీసుకుపోవాలి. 1600లో బ్రూనోని సజీవ దహనం చేసిన ఇటలీ పాలకులు 1889లో తమ తప్పు తెలుసుకుని సత్యమే గెలుస్తుంది అని బ్రూనో స్థూపాన్ని నిర్మించారు. డార్విన్ పరిణామవాదం వాస్తవమని కరోనా సందర్భంలో కూడా నిరూపితమైంది. ఇమ్యూనిటీని పెంచుకోగలిగిన జీవులే బతికాయి. సైన్స్ ద్వారా తయారైన వ్యాక్సినే మానవ సమాజాన్ని రక్షించింది. అందుకే పాలకులు వారి పరిపాలన ఆధిక్యత కోసం సత్యం మాట్లాడిన వారిని, వాస్తవాలు చెప్పేవారిని ఇబ్బంది పెట్టినా అంతిమ విజయం సత్యందే. సైన్స్ ఫలాలను అనుభవిస్తూ సైన్స్‌ను కాకుండా మూఢ నమ్మకాలకు విలువ ఇచ్చేవారిని ఎలా అర్థం చేసుకోవాలి? సత్యం కోసం ఏ కాలంలోనైనా కొద్దిమంది మాత్రమే నిలబడతారు. కాని అలా నిలబడ్డవారు తమ ఆచరణ ద్వారా మరికొద్దిమందిని నిలబడేటట్లు ప్రభావితం చేస్తారు. సత్యం కోసం ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొంటారు. సత్యం నమ్మడం, నమ్మకపోవడంపై ఆధారపడి ఉండదు. ఏ కాలంలోనైనా పరిశోధనల ద్వారా నిరూపణకు నిలబడడం మీద ఆధారపడి ఉంటుంది. సత్యం ప్రశ్నించడాన్ని నేర్పుతుంది. చైతన్యపరుస్తుంది. చావో రేవో తేల్చుకునైనా సత్యం వైపే నిలబడమంటుంది. అందుకే పాలక వర్గాలకు సత్యం సరిపడదు. సత్యం గొంతుక నొక్కాలని చూస్తారు. సత్యాన్ని లోతుల్లోకి పూడ్చేశామని ఆనందపడతారు.

కాని సత్యం లోతులను సైతం పెకలించుకుని మొలకెత్తుతూనే వుంటుంది. సత్యం ఎప్పుడూ సత్యమే. సత్యమే జయిస్తుంది. సత్యం కోసం నిలబడితే, ఇంత చైతన్యం వస్తే, నిటారుగా నిలబడ్డ వారందరూ సత్యం కోసం నిలబడితే, సమాజ గమనం సమానత్వం వైపు దూసుకుపోతుంది.

(వ్యాసకర్త యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు)

★

'ఈనాడు' మధ్యంతర పిటిషన్లు డిస్మిస్

- ప్రధాన పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ, వార్డు వాలంటీర్‌, గ్రామ, వార్డు సచివాలయాలకు దినపత్రిక కొనుగోలు నిమిత్తం నెలకు రూ.200 మేరకు ప్రభుత్వం ఆర్థిక చేయూత ఇవ్వడాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఈనాడు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్‌ చేసింది. వాలంటీర్లు, సచివాలయాలు సాక్షి దినపత్రిక కొనుగోలు చేస్తే దానిని పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్‌ బ్యూరో సర్క్యులేషన్‌ (ఎబిసి)ను ఆదేశించాలన్న వినతిని కూడా తిరస్కరించింది. ఈ మేరకు రెండు మధ్యంతర పిటిషన్లను కొట్టేస్తూ చీఫ్‌ జస్టిస్‌ పికె మిశ్రా, జస్టిస్‌ ఎన్‌ జయసూర్యతో కూడిన డివిజన్‌ బెంచ్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ జిఓల అమలును నిలిపేయడంతో పాటు, 2002 జులై-డిసెంబరు, ఆ తరువాత కాలానికి సాక్షి సర్క్యులేషన్‌ను ఆడిట్‌ చేయకుండా ఎబిసికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఉషోదయ డైరెక్టర్‌ ఐ వెంకట్‌ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను కొట్టేసింది. సాక్షి పత్రికను కొనుగోలు చేసేందుకే ఆ విధంగా ప్రభుత్వం డబ్బులు ఇస్తోందో.. లేదో.. సమగ్ర విచారణ చేస్తామని ప్రకటించింది. ప్రధాన పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో తుది ఉత్తర్వులపై ఏ ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది.

వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించండి

- శ్రీకృష్ణదేవరాయలు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పల్నాడు వాసుల ఏడు దశాబ్దాల కల, అతిపెద్ద నీటి ప్రాజెక్టు వరికపూడిసెల లిఫ్ట్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. నిర్మాణానికి కావాల్సిన అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖలోని అటవీశాఖ ఎడిజి (అడిషనల్‌ డైరెక్టర్‌ జనరల్‌) బివాష్‌ రంజన్‌ను ఎంపి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనుమతులు పొందడానికి అవసరమైన డిపిఆర్‌ సహా, అన్ని ప్రక్రియలనూ పూర్తి చేసి.. నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించినట్లు చెప్పారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఇయు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఫేస్‌ రికగ్నేషన్‌ విధానాన్ని వారికి మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి పిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయీస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవిరావు, వలిశెట్టి దామోదరరావు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సిఎస్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ పిఆర్‌సి సెప్టెంబరు నెలలో అమల్లోకి వచ్చినప్పటికీ 2,096 మంది ఉద్యోగులకు పదోన్నతులు పొందిన వారికి కూడా పిఆర్‌సి అమలు చేయాలని నేతలు డిమాండ్‌ చేశారు. ఆర్‌టిసిలో పెద్ద సంఘాలకు రికగ్నేషన్‌ ఇవ్వాలని, పిఆర్‌సి అమలు జరిగినప్పటి నుంచి నిలిపివేసిన ఆరునెలల ఓడి అలవెన్సులు చెల్లించాలని పిటిడి ఎంప్లాయీస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు.

తజకిస్తాన్‌లో చిక్కుకున్న 36 మంది జార్ఖండ్‌ కూలీలు

హజారీబాగ్‌ : జార్ఖండ్‌ నుండి ఉపాధిని వెతుక్కుంటూ వెళ్ళిన 36 మంది వలస కూలీలు తజకిస్తాన్‌లో గత రెండు మాసాలుగా చిక్కుకుపోయారు. విద్యుత్‌ లైన్లు వేయడానికి పనిలో కుదుర్చుకున్న కంపెనీ తమ పాస్‌పోర్టులను లాక్కుందని, తమకు సరిగ్గా ఆహారం కూడా అందించడం లేదని, చేతిలో డబ్బు లేకుండా పోయిందని వారు సామాజిక మాధ్యమాల ద్వారా తమ బాధలు చెప్పుకున్నారు. సామాజిక కార్యకర్త సికిందర్‌ అలీ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా, వారిని స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ అధికారి హామీ ఇచ్చారు. గతేడాది డిసెంబరు 19న తజకిస్తాన్‌ వెళ్ళిన వీరికి మంచి జీతాలు వస్తాయని, ఇక్కడ పనిచేస్తున్న ఏజెంట్లు హామీ ఇచ్చారని అలీ చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌, అదాని అవినీతిపై 24న నిరసనలు : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా ద్రోహం చేసిందని తెలిపారు. అదాని కుంభకోణం అంతర్జాతీయంగా దేశానికి తలవంపులు తెచ్చిపెట్టిందని, దేశంలోని చిన్న మదుపుదార్లతోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్‌ఐసిని పూర్తిగా ముంచేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని అదాని పరం చేస్తుండడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అదాని అవినీతికి వ్యతిరేకంగా ముందుకురావాలని కోరారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా పార్లమెంటులో రాష్ట్రానికి చెందిన సభ్యులు నోరెత్తక పోవడం తగదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర హక్కుల సాధన కోసం అన్ని నియోజకవర్గాల్లో పార్లమెంటు సభ్యులకు వినతిపత్రాలు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 24న చేపట్టబోయే ధర్నాలు, ప్రదర్శనలను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.

త్రిపుర మహిళా కమిషన్‌ ఛైర్మన్‌పై దాడి

చీర లాగేసి..జాకెట్టు చించేసి దాష్టీకం





అగర్తల : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో ఎనలేని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న బిజెపి రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని సైతం ఎన్నికల్లో వినియోగించుకునేందుకు బరితెగిస్తోంది. సహకరించని నేతలపై భౌతిక దాడులకు పాల్పడుతోంది. ధర్మనగర్‌ సిట్టింగ్‌ ఎమ్మెల్యే విశ్వబంధు సేన్‌ తరపున ప్రచారానికి సహకరించలేదనే అక్కసుతో సొంత పార్టీకి చెందిన సీనియర్‌ నేత, పైగా త్రిపుర మహిళా కమిషన్‌ ఛైర్మన్‌ బర్నాలి గోస్వామిపై మహిళా మోర్చా నాయకులతో దాడి చేయించారు. ఈ దాడిలో ఆమె చేతికి గాయాలయ్యాయి. ఈ దాడితో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన గోస్వామి అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా కమిషన్‌ ఛైర్మన్‌ అయిన తనపైనే బిజెపి గూండాలు ఇంత దాడికి ఒడిగట్టారంటే ఇక సామాన్య ప్రజానీకం పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అని ఆందోళన వ్యక్తం చేశారు. 'బిజెపి జెండాలు పట్టుకున్న కొందరు నన్ను చుట్టుముట్టారు. చీర లాగేశారు. జాకెట్టు చించేసి..దాడి చేశారు. మహిళా కమిషన్‌ ఛైర్మన్‌కే రక్షణ లేకపోతే..ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి?' అని ఆమె ప్రశ్నించారు. అయితే ఈ దాడి ఘటనపై విలేకర్లు గోస్వామిని ప్రశ్నించగా ఆయన సమాధానమివ్వకుండా గోస్వామి ఆర్‌ఎస్‌ఎస్‌ మూలాలు ఉన్న బలమైన నేత. అయితే ఆమెకు టిక్కెట్‌ దక్కనీయకుండా స్థానిక సిట్టింగ్‌ ఎమ్మెల్యే విశ్వబంధు సేన్‌ అడ్డుకున్నారని, ఈ క్రమంలో ఆమె పార్టీ ప్రచారానికి దూరంగా ఉంటున్నారని బిజెపికి చెందిన చేయించినట్లు చెబుతున్నారు. కాగా ఈ దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. బర్నాలి గోస్వామి కన్నీటి పర్యంతమవుతూ విడుదల చేసిన వీడియోను సిపిఎం పోస్టు చేసింది.

త్రిపుర ఎన్నికల్లో కేంద్రహోంమంత్రి అమిత్‌ షా ప్రత్యక్ష జోక్యం

- ఎన్నికల సంఘానికి సిపిఎం లేఖ

న్యూఢిల్లీ : త్రిపుర శాసనసభ ఎన్నికల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని ప్రభావితం చేస్తుండటంపై సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి లేఖ రాశారు. సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి రాసిన లేఖను ఆయన జత చేశారు. శాసనసభ ఎన్నికల్లో నేరుగా కేంద్ర హోంమంత్రి జోక్యం చేసుకోవడం చాలా ఆందోళనకర అంశమని ఏచూరి పేర్కొన్నారు. ఇదివరకు జరిగిన ఇసి సమావేశంలో కేంద్ర హోంమంత్రి జోక్యం చేసుకొనే వీలుందని తాము ఆందోళన వ్యక్తం చేశామని ఆయన తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని ఆ సమావేవంలో ఇసి హామీ ఇచ్చిందని ఏచూరి గుర్తు చేశారు. ఆ హామీకి భిన్నంగా కేంద్ర హోంమంత్రి జోక్యం చేసుకుంటున్న వ్యవహారాలపై మీడియాలో కథనాలు వస్తున్నాయన్నారు. తక్షణమే జోక్యం చేసుకొని ఎన్నికల కోడ్‌ ఉల్లంఘించి జరుగుతున్న జోక్యాలను తక్షణమే అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక పరిశీలకుల ద్వారా నివేదికలు తెప్పించుకొని కేంద్ర హోంమంత్రితో సమావేశమైన ఎన్నికల అధికారులపైనా, బిజెపి వాళ్లపైనా చర్యలు తీసుకుంటారని భావిస్తున్నామని ఆయన తెలిపారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆడిట్‌ కోసం గ్రాంట్‌ థోర్టంట్‌ నియామకం

- అదాని గ్రూపు వెల్లడి

న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్‌ తీవ్ర ఆర్థిక ఆరోపణల నేపథ్యంలో అదాని గ్రూపు తమ కొన్ని కంపెనీల్లో స్వతంత్ర ఆడిటింగ్‌ కోసం అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్‌ థోర్టంట్‌ను నియమించుకుంది. అదాని కంపెనీలు తీవ్ర ఎకౌంటెన్సీ అక్రమాలు, కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకోవడం, డొల్ల కంపెనీలతో విదేశాల నుంచి పెట్టుబడులకు పాల్పడుతుందని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్‌ ఓ రిపోర్టులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ దెబ్బతో అదాని కంపెనీ స్టాక్స్‌ల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. మరోవైపు అదాని కంపెనీలకు అప్పులిచ్చిన బ్యాంక్‌లు, విత్త సంస్థలు, బీమా కంపెనీలు బెంబేలెత్తుతున్నాయి. అదాని గ్రూపునపై వచ్చిన అరోపణలను తిప్పికొట్టేందుకు.. అదాని వాదనలను సమర్థించుకునేందుకు, ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచుకునేందుకు గ్రాంట్‌ థోర్టంట్‌ సంస్థను ఆడిటింగ్‌కు నియమించుకుని ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

సమాధానాల దాటవేతలో దిట్ట

- ప్రధానమంత్రి మోడీపై స్టాలిన్‌ ఫైర్‌



చెన్నయ్‌ : ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా కేంద్రంలోని మోడీ సర్కార్‌ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ విమర్శించారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీయే పార్లమెంటులో అంగీకరించారని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేస్తూ ఇటీవల పార్లమెంటులో మోడీ చేసిన ప్రసంగాన్ని తప్పుబడుతూ స్టాలిన్‌ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సమాధానాల దాటవేతలో మోడీ దిట్ట. విపక్షాలు అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ ఆయన బదుల్విలేకపోయారు. సమాధానాలు లేకుండా ప్రధాని అద్భుతంగా ప్రసంగించారు' అని ఆయన ఎద్దేవా చేశారు. గత కొంతకాలంగా బిజెపి ప్రభుత్వంపై అనేక ఆరోపణలు వస్తున్నా..ప్రధాని స్పందించకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారు. బిబిసి డాక్యుమెంటరీపై కానీ, అదానీ గ్రూప్‌ అక్రమాలపై కానీ ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేకపోయారని స్టాలిన్‌ తప్పుబట్టారు. ప్రజా విశ్వాసమే తనకు సురక్ష కవచమని ప్రధాని చెప్పుకుంటున్నారని, వాస్తవానికి ప్రజలు అలా భావించడం లేదని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఇడి)..ప్రతిపక్షాలను ఏకం చేస్తోందంటూ సభలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై స్టాలిన్‌ స్పందిస్తూ 'ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ఇడి ద్వారా ప్రతీకార రాజకీయాలు పాల్పడుతున్నామని అంగీకరించినట్లేగా' అని పేర్కొన్నారు. ప్రతీకార రాజకీయాలు చేస్తున్నామంటూ అంగీకరించిన తొలి ప్రధాని మోడీ కాబోలు అని ఆయన ఎద్దేవా చేశారు. ఇలాంటి రాజకీయ సిద్ధాంతాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. దేశానికి కూడా ఇలాంటి వారి వల్ల ఇసుమంత కూడా ఉపయోగం లేదన్నారు. బడ్జెట్‌ సమావేశాల్లో భాగంగా ఇటీవల పార్లమెంట్‌లో ప్రసంగించిన ప్రధాని.. విపక్షాలపై ప్రతిదాడి చేసిన విషయం తెలిసిందే.

ప్రజారోగ్య వ్యవస్థ పరిరక్షణ కోసం

కదంతొక్కిన స్పెయిన్‌ ప్రజలు

పెడ్రో ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భారీ ప్రదర్శనలు

మాడ్రిడ్‌ : ప్రజారోగ్య వ్యవస్థను పరిరక్షించుకునేందుకు స్పెయిన్‌ ప్రజానీకం ఉద్యమబాట పట్టారు. అక్కడి పెడ్రో ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర చర్యలను నిరసిస్తూ భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గత ఆదివారం చేపట్టిన భారీ ర్యాలీల్లో పది లక్షల మంది పైగా ప్రజలు పాల్గొన్నారు. వాయువ్య స్పెయిన్‌లోని శాంటియాగో డి కంపెస్టెలాలో నిర్వహించిన ర్యాలీలోనే దాదాపు 20 వేల మంది ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. 'ఆరోగ్య హక్కు.. మానవ హక్కు.. ఆరోగ్య సేవలను రక్షించండి' అంటూ ప్లకార్డులు పట్టుకుని జాతీయ పతాకాలతో ఆందోళనకారులు నినాదాలను హోరెత్తించారు. 'స్పెయిన్‌లో ప్రజారోగ్య వ్యవస్థ చాలా బాగుండేది. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్య వ్యవస్థ క్షీణించింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత మరీ క్షీణిస్తోంది' అని ఆందోళనకారులు పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఆసుపత్రిలో పనిచేసే నర్సు మైట్‌ లోపెజ్‌ మాట్లాడుతూ.. 'పరిస్థితి ఏం బాగోలేదు. మేము రోగులకు సరైన జాగ్రత్తలు తీసుకోలేకపోతున్నాము' అని వాపోయారు. స్పెయిన్‌ ప్రభుత్వం తలసరి ఖర్చు కన్నా తక్కువ మొత్తాన్ని ఖర్చు చేస్తుందని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. మెరుగైన పని పరిస్థితులు, వేతనాలను కోరుతూ మాడ్రిడ్‌లోని అమిట్స్‌ వైద్యుల సంఘం గత ఏడాది నవంబర్‌ నుండి సమ్మె చేస్తోంది. ఈ సమ్మెల్లో శిశు సంరక్షణ వైద్యులు కూడా పాల్గొంటున్నారు.



శాంటియాగో డి కాంపోస్టెలా ఇమేజ్‌ క్వోస్‌ ఎ సోలర్‌ వీధుల్లోకి వేలాది మంది ప్రజలు వచ్చారు.

నియంతృత్వంపై నిరసనాగ్రహం

- ఇజ్రాయిల్‌ పార్లమెంట్‌ వద్ద భారీ ర్యాలీ



జెరూసలేం : ఇజ్రాయిల్‌లో నెతన్యాహు నియంతృత్వ చర్యలను నిరసిస్తూ ఆ దేశ పార్లమెంటు వెలుపుల మంగళవారం నాడు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. 'ప్రజాస్వామ్యం కావాలి, నియంతృత్వం వద్దు' అంటూ దేశం నలుమూలల నుండి వచ్చిన తరలివచ్చిన ఇజ్రాయిలీలు నినాదాలతో హోరెత్తించారు. జాతీయ పతాకాలను పట్టుకుని, కొమ్ము బూరాలు ఊదుతూ, నినాదాలు చేస్తూ వారు నిరసన తెలిపారు. ఇటీవలి సంవత్సరాల్లో పార్లమెంట్‌ వెలుపల ఇంత పెద్ద ఎత్తున నిరసన జరగడం ఇదే. లక్ష మంది వరకు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారని నిర్వాహకులు చెబుతున్నారు. అన్ని రంగాలు, విభాగాలకు చెందిన వారు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. దేశ న్యాయ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ప్రధాని బెంజామిన్‌ నెతన్యాహు ప్రభుత్వం వివాదాస్పదమైన ప్రణాళికను చేపట్టింది. అయితే ఆ ప్రణాళికను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నెతన్యాహు ప్రభుత్వం చేయతలపెట్టిన ప్రతిపాదిత మార్పులను నిరసిస్తూ వారాల తరబడి ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. వాణిజ్యవేత్తల నుండి మాజీ సైనికోద్యోగుల వరకు అన్ని వర్గాలకు చెందిన వారు వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీటిపై ఆందోళన వ్యక్తం చేస్తూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ ప్రకటన కూడా చేశారు. ఈ ప్రణాళిక అమలును నిలుపుచేయాల్సిందిగా దేశాధ్యక్షుడు కోరినప్పటికీ, నెతన్యాహు మిత్రపక్షాలు మాత్రం వాడిగా, వేడిగా జరిగిన సమావేశంలో పలు చట్టపరమైన మార్పులను ఆమోదించారు. వీటిని ఇప్పుడు ఆమోదం నిమిత్తం పార్లమెంట్‌కు పంపించనున్నారు. అయితే దీనిపై వారాల తరబడి పోరాటం కొనసాగే అవకాశముందని భావిస్తున్నారు. "మా వ్యతిరేకతను వారు వింటున్నారు, బలమైన సత్యం గొంతును వారు వింటున్నారు." అని ప్రతిపక్ష నేత యార్‌ లపిడ్‌ పార్లమెంట్‌ వెలుపల వేదిక నుండి మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. మా గొంతు విని వారు భయపడుతున్నారని అన్నారు. అయితే, అధికారాలు ఎక్కువ కలిగిన న్యాయ వ్యవస్థకు పగ్గాలు వేయాలంటే ప్రతిపాదిత మార్పులు చేయడం అవసరమని నెతన్యాహు, ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. అయితే న్యాయ వ్యవస్థ ప్రక్షాళన అనేది కుట్రతో సమానమని, దీనివల్ల ఇజ్రాయిల్‌ ప్రజాస్వామ్యం నాశనమవుతుందని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న నెతన్యాహుకు ఈ మార్పులు తీసుకురావడం వల్ల స్వప్రయోజనాలు వున్నాయని వారు పేర్కొంటున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 2.75 లక్షల కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11న 411 లోక్‌ అదాలత్‌ బెంచ్‌ల ద్వారా హైకోర్టుతో పాటు అన్ని జిల్లాల్లో నిర్వహించిన జాతీయ లోక్‌ అదాలత్‌లలో 2,75,954 కేసులు పరిష్కారమయ్యాయని ఎపిఎస్‌ఎల్‌ఎస్‌ఎ మెంబరు సెక్రటరీ ఎం బబిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల్లో 2,44,904 పెండింగ్‌ కేసులు, 31,050 ప్రీ లిటిగేషన్‌ కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. పరిష్కారమైన కేసుల విలువ రూ.254.52 కోట్లు అని పేర్కొన్నారు. హైకోర్టు చీఫ్‌ జస్టిస్‌ ప్రశాంత్‌ కుమార్‌ మిశ్రా ఆదేశాలతో ఎపి హైకోర్టు లీగల్‌ సర్వీసెస్‌ కమిటీ ఛైర్మన్‌ ఎవి శేషసాయి పర్యవేక్షణలో జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించినట్లు తెలిపారు.

భూకంప బాధితులకు మెక్సికో రూ.45 కోట్ల విరాళం

మెక్సికో : సిరియాలో భూకంపానికి గురైన ప్రజలను ఆదుకు నేందుకు మెక్సికో ప్రభుత్వం భారీ విరాళం ప్రకటించింది. ఈ మేరకు మెక్సికో విదేశీ వ్యవహారాల కార్యదర్శి మెర్సెలో ఎబ్రార్డ్‌ మంగళవారం వెల్లడించారు. 'మెక్సికో అధ్యక్షుడు లోపెజ్‌ ఒబ్రడార్‌ సూచనతో ఐక్యరాజ్యసమితి ద్వారా సిరియాకు రూ.45 కోట్ల మొత్తాన్ని విరాళంగా అందజేశాం ' అని ట్వీట్‌ చేశారు.

త్రిపురలో ముగిసిన ప్రచారం

న్యూఢిల్లీ : మంగళవారం నాటితో త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. గురువారం నాటి ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైందని ఎన్నికల ముఖ్య అధికారి కిరణ్‌కుమార్‌ తెలిపారు. 60 స్థానాలున్న త్రిపుర అసెంబ్లీకి జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ వామపక్షాలు, కాంగ్రెస్‌కు, బీజేపీ కూటమికి మధ్య నెలకొంది. "అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4గంటలతో ముగిసింది. ఎన్నికల ప్రచారం అంతా ప్రశాంతంగా సాగింది. పోలింగ్‌ను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్‌ యంత్రాంగమంతా సన్నద్ధమైంది" అని సీఈవో కిరణ్‌కుమార్‌ మీడియాకు తెలిపారు. పోలింగ్‌ నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా 3328 పోలింగ్‌ బూత్‌లను ఈసీ ఏర్పాటుచేసింది. ఇందులో 1100 సున్నితమైన ప్రాంతాల్లో, 28 ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్నట్టు ఆయన తెలిపారు. బంగ్లాదేశ్‌ సరిహద్దు వెంబడి భద్రత, పోలీస్‌ పహారా పెంచినట్టు రాష్ట్ర పోలీస్‌ ఉన్నతాధికారి ఒకరు ప్రకటించారు.

గత నెలరోజులుగా సాగిన ఎన్నికల ప్రచారంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీజేపీ తరపున ప్రధాని మోడీ, అమిత్‌ షా, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా..మరో డజను మందికిపైగా కేంద్ర మంత్రులు త్రిపురలో పర్యటించారు. వామపక్షాలు, కాంగ్రెస్‌ తరపున సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీనియర్‌ నాయకులు ప్రకాశ్‌ కారత్‌, బృందా కారత్‌, మహమ్మద్‌ సలీం, మాజీ సీఎం మాణిక్‌ సర్కార్‌, రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి మొదలైన వారు ఎన్నికల ప్రచారంలో ప్రధాన భూమిక వహించారు. కాంగ్రెస్‌ నుంచి రాహుల్‌ గాంధీ, ప్రియాంక గాంధీ..ఎవ్వరూ ప్రచారంలో పాల్గొనకపోవటం చర్చనీయాంశమైంది. బీజేపీ-55 స్థానాల్లో, ఐపీఎఫ్‌టీ ఆరు స్థానాల్లో అభ్యర్థుల్ని నిలిపింది. వామపక్షాలు-47, కాంగ్రెస్‌-13 స్థానాల్లో పోటీ చేస్తోంది. దాదాపు 28.13 లక్షల మంది ఓటర్లు రేపు జరిగే పోలింగ్‌లో అభ్యర్థుల భవిష్యత్తును తేల్చనున్నారు.

ఏప్రిల్‌ 14న అంబేద్కర్‌ విగ్రహావిష్కరణ

- శరవేగంగా విగ్రహ నిర్మాణ పనులు
- ఢిల్లీలో మేరుగ నాగార్జున వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



విజయవాడలోని స్వరాజ్‌ మైదానంలో ఏర్పాటు చేయనున్న 125 అడుగుల బిఆర్‌ అంబేద్కర్‌ విగ్రహాన్ని నిర్ణీత గడువు ప్రకారం వచ్చే ఏప్రిల్‌ 14ననే ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ఢిల్లీలో తయారవుతున్న ఈ విగ్రహాన్ని ఆయన నేతృత్వంలోని నలుగురు మంత్రుల కమిటీ మంగళవారం పరిశీలించింది. విగ్రహ నిర్మాణ పనుల్లో ఎక్కడా ఎటువంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మేరుగ తెలిపారు. మేరుగ ఛైర్మన్‌గా ఉన్న అంబేద్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీలో ఉపముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు పలువురు రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ఢిల్లీలో పర్యటించి విగ్రహ తయారీ పనులను సమీక్షించారు. మంత్రుల బృందం ఢిల్లీలో అంబేద్కర్‌ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించడం ఇది రెండోసారి. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. రాబోయే అంబేద్కర్‌ జయంతి రోజున విగ్రహాన్ని ఆవిష్కరించాలని సిఎం జగన్‌ పట్టుదలతో ఉన్నారని, విగ్రహ నిర్మాణ పనులను మంత్రులతోపాటు సిఎం కూడా స్వయంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే విగ్రహానికి సంబంధించిన పలు విడిభాగాలు విజయవాడకు చేరుకున్నాయన్నారు. రూ.268 కోట్లతో నిర్మించాలనుకున్న ఈ అంబేద్కర్‌ స్మృతివనం నిర్మాణ వ్యయం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.



హౌరా రైల్వేస్టేషన్‌ ఆంధ్రప్రదేశ్‌ ప్రతినిధులకు స్వాగతం చెబుతున్న ఆహ్వాన కమిటీ వలంటీర్లు

సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం వివిధ ప్రజాసంఘాల సౌహార్ద్ర సందేశాలు ఇవ్వనున్నారు. సిఐటియు నుండి నీలోత్పల్‌ బసు, ఎఐకెఎస్‌ నుండి విజూకృష్ణన్‌ హాజరు కానున్నారు. 2020 జనవరి 1, 2, 3 తారీఖుల్లో కన్నూరులో జరిగిన మహాసభల్లో తీసుకున్న కార్యాచరణపై మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో ప్రతినిధులు చర్చించనున్నారు. భవిష్యత్‌ కార్యాచరణ రూపొందించనున్నారు. దేశ వ్యాప్తగా వ్యవసాయ కార్మిక పోరాటాలు దిశానిర్దేశం చేసే విధంగా మహాసభ జరగనుందని సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్‌ తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎ నిరంకుశ విధానాలతో వ్యవసాయ కార్మికులు, కార్మికుల జీవన స్థితి అంతకంతకు దిగజారిపోతుందని తెలిపారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంతో వారి జీవితం దుర్భరమైందని ఉపాధి గగనమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపైన, కార్మిక వ్యతిరేక పద్ధతులపైనా చర్చించి భవిష్యత్‌ కార్యాచరణ చేస్తామని చెప్పారు. వామపక్ష ఉద్యమాలకు సంబంధించి మహాసభలకు ఆహ్వానం పలకడంలో కేరళ ఎప్పుడూ ప్రత్యేకతను నిలబెట్టుకుంటుందని, అదే తరహాలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభకు బెంగాల్‌ నాయకత్వం ఏర్పాట్లు చేసిందని చెప్పారు. అహెూరాత్రులు శ్రమించిన కార్యకర్తలకు, వలంటీర్లకు, నాయకత్వానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బిబిసిపై ఐటి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న విదేశీ మీడియాకు కూడా దీనిని విస్తరింపచేశారని పేర్కొంది. ఈ చర్యతో మీడియా విమర్శలను మోడీ ప్రభుత్వం ఏ మాత్రం సహించదన్న విషయం, నిరంకుశంగానైనా ఆ సంస్థలను అణచివేస్తుందన్న విషయం అంతర్జాతీయంగానూ స్పష్టమవుతుందని తెలిపింది.

హిండెన్‌బర్గ్‌పైనా దాడి చేస్తారా...? : కెటిఆర్‌

. 'వాట్‌ ఎ సర్‌ ప్రైజ్‌... ప్రధానిపై డాక్యుమెంటరీ ప్రసారం చేసిన కొన్ని వారాలకే బిబిసి ఇండియాపై ఐటి దాడులు జరిగాయి. సిబిఐ, ఐటి, ఇడి సంస్థలు బిజెపి చేతిలో కీలుబొమ్మలుగా మారాయి. వాట్‌ నెక్స్ట్‌, అదానీ వ్యవహారం బైటపెట్టిన హిండెన్‌బర్గ్‌పై కూడా త్వరలో ఇడి దాడులు ఉంటాయా?' అని తెలంగాణ మంత్రి కెటిఆర్‌ ప్రశ్నించారు.

ఆందోళన కరం : ఎడిటర్స్‌ గిల్డ్‌

బిబిసిపై జరుగుతున్న ఐటి దాడులను ఆందోళనకరంగా ఎడిటర్స్‌ గిల్డ్‌ అభివర్ణించింది. మీడియా సంస్థల గొంతు నులమడానికి జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తాయని పేర్కొంది. బిబిసిపై ఐటి దాడులను ఎన్‌ఎజె, ఢిల్లీ యూనియన్‌ ఆఫ్‌ జర్నలిస్టులు కూడా తీవ్రంగా ఖండించాయి.

కక్షతోనే బిబిసిపై దాడి : ఎన్‌ఎజె


బిబిసి కార్యాలయాలపై ఐటి దాడులను నేషనల్‌ అలయెన్స్‌ ఆఫ్‌ జర్నలిస్ట్‌ (ఎన్‌ఎజె), ఢిల్లీ యూనియన్‌ ఆఫ్‌ జర్నలిస్ట్‌ (డియుజె) తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు ఎన్‌ఎజె అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె పాండే, ఎన్‌ కొండయ్య, డియుజె అధ్యక్షులు సుజాత మధోక్‌ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని ప్రధాన మీడియాను తన గుప్పెట్లో పెట్టుకున్న మోడీ ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాసేవారిని భయపెట్టేలా దాడులకు పాల్పడటం తగదని అన్నారు.

సమర్థించుకున్న బిజెపి

బిబిసిపై ఐటి దాడులను బిజెపి సమర్థించుకుది. భారత్‌లో బిబిసి విషపూరిత ప్రచారానికి పాల్పడిందని ఆ పార్టీ పేర్కొంది.

ఈ దాడుల పట్ల ఎందుకు భయపడుతున్నారు ? ఐటి విభాగం దాని పని అది చేసుకోవడానికి అనుమతించాలని బిజెపి జాతీయ ప్రతినిధి గౌరవ్‌ భాటియా వ్యాఖ్యానించారు.

వ్యక్తిత్వం




హేమ్లా తండాలో రాజన్న, రాధమ్మ దంపతులు ఉండేవారు. వారి కూతురు ఝాన్సీ తొమ్మిదో తరగతి చదువుతుంది. రాజన్నది చాలా పేద కుటుంబం. పనికి వెళితేనే ఇల్లు గడుస్తుంది. దాంతో ఝాన్సీకి మంచి బట్టలు కొని పెట్టే స్థోమత వారికి ఉండేది కాదు. దాంతో ఝాన్సీని వాళ్ళ స్కూల్లో కొందరు ఎప్పుడూ పాత బట్టలు వేసుకుంటావని ఏడిపించేవారు.

ఒకరోజు నాన్న దగ్గరికి వెళ్లి బాధపడేది ఝాన్సీ. 'అమ్మా నీది మంచి మనసు. ఎవరైనా బాధపడితే చూస్తూ ఊరుకోలేవు. బట్టలు కొన్ని రోజులు ఐతే చిరిగిపోతాయి. మనసు ముఖ్యం తల్లీ' అని రాజన్న ఝాన్సీని ఓదార్చాడు. కానీ రాజన్నకు మనసులో బిడ్డకు కొత్త బట్టలు కొనలేకపోతున్నాననే బాధ ఉండేది. ఎలాగైనా బిడ్డకు కొత్త బట్టలు తీసుకోవాలని ఆశతో రోజంతా కష్టపడేవాడు. 'తిండీ తిప్పలు మానేసి బట్టలు కొనడం అవసరమా?' అని రాధమ్మ అన్నది. 'నా బిడ్డ సంతోషమే ముఖ్యం. దాని కోసం ఎంతైనా కష్టపడతా' అని అన్నాడు రాజన్న. ఆ మాటలు విన్న ఝాన్సీ బాధపడింది. 'మా మంచి నాన్న' అని గట్టిగా కౌగిలించుకుంది. 'నాన్నా.. నాకు ఏ కొత్త బట్టలు వద్దు. అమ్మా మీరు సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటే చాలు' అన్నది ఝాన్సీ.

గణతంత్ర దినోత్సవం రోజున ఝాన్సీకి వేదికపై మాట్లాడే అవకాశం వచ్చింది. అప్పుడు 'మనిషికి నిజమైన అలంకారం వేసుకునే బట్టలు, ఆభరణాలూ కాదు. మంచి మాట, వ్యక్తిత్వం విలువైన అలంకారం." అని చెప్పింది. ఆ మాటల అర్థం తెలుసుకున్న తోటి విద్యార్థులు ఝాన్సీతో స్నేహంగా ఉండడం మొదలు పెట్టారు.

- అజ్మీరా ఝాన్సీలక్ష్మి
9వ తరగతి,
63053 93291

దారి చూపండి



చిన్నారులూ, బుజ్జికి కిరీటం కావాలట. మరి తీసుకొచ్చి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



వన్నోజ్ విద్యాన్ష్, 2వ తరగతి, సరూర్ నగర్, హైద్రాబాద్.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



నా సిద్ధాంతం అందుకు వ్యతిరేకం ...

నన్నే చిత్రపటంలా
మీ గోడ మీద వేలాడదీయాలనుకుంటారా?
నేను జారిపోతాను..
ఆకస్మిక వరదలా తలెత్తి మిమ్మల్ని దాటిపోతాను
నేను భూమినవుతాను
అగ్నినవుతా ఆకాశంగా మారతా
గాలిగా నీరుగా మార్చుకుంటాను
మీరు నన్ను ఎంత నిర్బంధిస్తే
అంతకు పదింతలై విజృంభిస్తాను
సహజ జలపాతంలా పరవళ్లు తొక్కుతాను

ఇదీ, ప్రముఖ తమిళ రచయిత్రి సుకీర్తారాణి కవితాత్మక వ్యక్తీకరణ. ఇది వొట్టి కవితే కాదు; ఆమె ఆచరణ, అనుసరణ కూడా! ఇటీవల అదానీ గ్రూపు అందిస్తున్న సాహిత్య పురస్కారాన్ని ఆమె తిరస్కరించారు. తమిళ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సుకీర్తారాణి 25 ఏళ్ల నుంచి తమిళంలో కవితలు, ఇతర రచనలు వెలువరిస్తున్నారు. తన భావజాలంలో పెరియార్, అంబేద్కర్, మార్క్స్ రచనల ప్రభావముందని చెబుతున్న ఆమె 'నేను కవితలు రాసేటప్పుడు సుకీర్తారాణినే కావొచ్చు. నా రచన బయటికి వచ్చిన తరువాత అది సమాజంలో భాగం. కవి ఎప్పుడూ ఒంటరి కాదు' అంటారు.

బాల్యం నుంచి తీవ్ర వివక్షను చవిచూసిన ఆమె ఆ పరిస్థితులు, ప్రభావాలను తన రచనల్లో కళ్లకు కట్టినట్లు చూపిస్తారు. నేటికీ ఆ పరిస్థితుల్లో మార్పు రాలేదని కన్నెర్రజేస్తారు. కులం, జాతి పరంగా స్త్రీలు ఎదుర్కొనే హింస ఆమె కవితల్లో ప్రతిధ్వనిస్తుంది. కుల గుర్తింపు, స్త్రీల శరీరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయని నొక్కి చెబుతున్న ఆమె జీవన ప్రస్థానం తన మాటల్లోనే ...

బాల్యం చేదు జ్ఞాపకాలు..

నేను 1973లో తమిళనాడు వెల్లూరులో లాల్‌పేట అనే చిన్న గ్రామంలో పుట్టాను. మా గ్రామంలో పది దళిత కుటుంబాలు ఉండేవి. అక్కడే నా బాల్యమంతా గడిచింది. నా తల్లిదండ్రులిద్దరూ ప్రాథమిక విద్య దాటి చదవలేదు. మా తరమే డిగ్రీ వరకు చదివింది. ఐదుగురు తోబుట్టువుల మధ్య నేను పెరిగాను. మా తాత పరాయ్ అని పిలిచే వాద్య పరికరం వాయించేవాడు. ప్రతి సంవత్సరం గ్రామంలో జరిగే జాతరలు, ఉత్సవాలలో ఆ పద్ధతి ఆనవాయితీగా చేసేవారు. ప్రతి ఏడాది వ్యక్తులు మారడం అక్కడ ఉండేది. నేను బాగా చిన్నగా ఉన్నప్పుడు ఒక ఏడాది ఆ వంతు మా నాన్నకు వచ్చింది. అయితే రాణిపేట పారీలో దినసరి కూలీగా పనిచేస్తున్న మా నాన్నకు అలా వాయించడం ఇష్టం లేదు. అదే విషయం గ్రామపెద్దలకు చెప్పాడు. వారి మాటలను కాదన్నందుకు మమ్మల్ని ఊరి నుండి గెంటేశారు. చిన్న ఉద్యోగమైనా మా నాన్న ఎప్పుడూ ఇస్త్రీ బట్టలే వేసుకునేవారు. చాలా హుందాగా ఉండేవారు. సాధారణంగా దళితులకు శుభ్రం ఉండదు. బట్టలు ఎప్పుడూ మురికిగా ఉంటాయి అని చాలామంది భావించడం నాకు తెలుసు. కాని మేము మా నాన్నను చూసి చాలా నేర్చుకున్నాం. అటువంటి మా నాన్నను దళితుడైన కారణంగా ఆనవాయితీని కాదన్నందుకు ఊరి నుండి పొమ్మన్నారు. మా నాన్న వేరే ఊళ్లో ఉండడం వల్ల ఆ ప్రభావం మాపై ఎక్కువగా లేదు. కాని ఆ గ్రామంలోనే ఉండేవాళ్ల పరిస్థితి ఏంటి? కులాన్ని బట్టి అణగారిన వాళ్లమని ఎందుకు పిలుస్తారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలే నా రచనలకు మూలం.

ఆ సంఘటన ఎప్పటికీ గుర్తుండిపోతుంది..

నేను 2వ తరగతి చదువుతున్నప్పుడు నా తరగతి గదిలో ఒక అమ్మాయి నాకొక మిఠాయి ఇచ్చింది. అది చాలా బాగుంది. ఆ మరుసటి రోజు అమ్మని అడిగి డబ్బులు తీసుకుని నేను కూడా ఓ మిఠాయి ఆ అమ్మాయికి తీసుకెళ్లాను. అయితే అది ఆమె తీసుకోలేదు. నా నుండి దూరంగా జరిగింది. ఆ చిన్నతనంలో అలా ఎందుకు జరిగిందో నాకర్థం కాలేదు. కాని ఆ అమ్మాయి పెత్తందారీ కులానికి చెందిన బాలిక. మాతో మాట్లాడవద్దని, మాతో ఏదీ పంచుకోకూడదని, మా దగ్గరగా కూర్చోవద్దని వారి పెద్దలు చెప్పినట్లు నాకు తెలుసు. నా జీవితంలో నేను ఎదుర్కొన్న మొదటి వివక్ష అది. నేను పెరుగుతున్న కొద్దీ అది నాలో ఎంతో సంఘర్షణను రగిల్చింది.

15 ఏళ్ల తరువాత ఉన్నతవిద్య చదివి రాణీపేట దగ్గర్లోని పాఠశాలకు టీచర్‌గా వెళ్లాను. ఒక రోజు నేను చదివిన స్కూలు, ఆ తరగతి గది చూసేందుకు వెళ్లాను. అయితే ఆ క్షణం నా మనసంతా ఏదో అలజడి. దానికి కారణం.. ఆనాటి సంఘటన.. ఆ సంఘర్షణ నుండే నా రచనలు ప్రారంభమయ్యాయి.

నేను ఒకదానిని..

నాకు 19 ఏళ్లప్పటి నుండి కవితలు రాయడం ప్రారంభించాను. అప్పటికి నాకున్న కొద్దిపాటి అవగాహన, నేను చదివిన పుస్తకాలు, నేను చూసిన చిన్న జీవితం నన్ను రచనలు చేసేలా ప్రోత్సహించాయి. అప్పటి వరకు నేను చెన్నైను కూడా చూడలేదు. ప్రపంచ సాహిత్యంలో ప్రవేశం లేదు. సంవత్సరాలు గడిచేకొద్దీ నా పఠనం విస్తరించింది. రాజకీయాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ప్రేమ గురించి రాసేవాళ్లు చాలా మందే ఉంటారు. అయితే నేను ఆ ప్రేమను ఒక వ్యక్తికే పరిమితం చేయాలనుకోలేదు. ఆ ప్రేమ సమాజం పట్ల చూపించాలనుకున్నాను. సామాజిక మార్పు దిశగా నా రచనలు సాగాలనుకున్నాను. ముఖ్యంగా దళిత స్త్రీలు, అణచివేతకు గురవుతున్న స్త్రీలు సమానత్వాన్ని సృష్టించాలనుకునే ఆశతో తమ గళాలను విప్పాలనుకుంటారు. అలాంటి వారిలో నేను ఒకదానిని.

నా బాల్యం కోల్పోయాను..

నా కులం కారణంగా 15 ఏళ్ల నా బాల్య జీవితాన్ని కోల్పోయాను. వివక్షతో దూరంగా గెంటివేయబడ్డాను. నా ప్రాంతం వారు తప్ప ఇతర స్నేహితులెవరూ ఉండేవారు కాదు. ఎవరూ మాట్లాడేవారు కాదు.. గ్రామంలోని స్కూల్లోనే కాదు. నగరానికి వెళ్లినా మేమంతా ఒక బృందంగా ఉంటే ఇతర కులాల వారంతా ఒక బృందంగా మెలగడం చూశాను. నేను ఇప్పుడు టీచర్‌గా ఇక్కడికి వచ్చాను. నన్ను ఇక్కడ దళిత టీచర్ అనే సంబోధిస్తారు. నా క్లాసు రూంలో నా వర్గం పిల్లలంతా ఒకటిగా, మిగతా వారంతా ఒకటిగా ఉండడం చూసి ఇన్నేళ్లైనా మారని పరిస్థితి లోంచే నా కవితలు పుట్టుకొస్తాయి.

భయంతో వణికిపోయాను..

నేను పెరిగిన వాతావరణమే కాదు.. నేను చూస్తున్న సమాజం కూడా నన్ను ప్రభావితం చేస్తుంది. 2006లో ఖైర్లాంజీ ఊచకోత సంఘటనలో ఓ దళిత యువతిని నగ్నంగా ఊరేగించి హత్యచేసిన ఘటన వీడియో తీసి మరీ చూపించారు. ఆ దృశ్యం నన్ను ఎంతో భయపెట్టింది. ఆ స్థానంలో నేనే ఉన్నంతగా వణికిపోయాను. సాధారణంగా స్త్రీల శరీరాలు అవమానకరంగా చూసే సమాజం.. దళిత స్త్రీ శరీరాన్ని ద్వేషిస్తుంది. పవిత్రతకు, స్వచ్ఛతకు మారుపేరుగా స్త్రీల శరీరాన్ని పరిగణించే ఈ సమాజం దళిత యువకుడు ఇతర అమ్మాయిని పెళ్లి చేసుకున్నా ఆమె అపవిత్రమైనట్లు భావించడం వెనుక స్త్రీ శరీరానికి సమాజం ఇస్తున్న ప్రాధన్యత అర్థమవుతుంది.

కులం వెంటాడుతోంది..

నా రచనలన్నీ నా సొంత అనుభవాలు కావు. కాని.. నేను ఇంట్లో ఉన్నంత వరకు నా కులం గురించి ఆలోచించను. కాని గుమ్మం దాటి బయటకి వచ్చాక కులం నా వెనక కుక్కలా వెంటబడుతుంది. బాల్యం నుండీ ఎన్నో పంచాయతీలు చూశాను. రెండు అగ్రవర్ణాల మధ్య తగవులొచ్చినప్పుడు వారిరువురూ పోట్లాడుకుని సమస్యను పరిష్కరించుకునేవారు. అదే ప్రత్యర్థి వర్గం దళిత సామాజిక వర్గమైనప్పుడు ఆ ఇంటి మహిళలు రోడ్డుపైకి ఈడ్చుబడతారు. వారి శరీరాలు వస్త్ర విహీనమై బహిరంగ ఊరేగింపుకు సాక్ష్యంగా నిలుస్తాయి. ఇటువంటి ఎన్నో దృశ్యాల నుండే నా రచనలు ప్రాణం పోసుకుంటాయి.

నా రచనలు అవార్డులు కోసం కాదు.. ప్రజల కోసం రాసినవి. జనం చదివారు. నాకు అది చాలు..

ఎందుకు వద్దన్నానంటే..

25 ఏళ్లుగా తమిళ సాహిత్యంలో క్రియాశీలకంగా ఉన్న సుకీర్తారాణిని అభినందిస్తూ ఇటీవల న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 'దేవ్ సమ్మాన్' అవార్డును ప్రకటించింది. అందుకు మొదట సంతోషం వ్యక్తం చేసిన ఆమె ఆ అవార్డును ప్రముఖ కార్పొరేట్ గ్రూపు అదానీ సంస్థ స్పాన్సర్ చేస్తుందన్న విషయం తెలియగానే ఆ పురస్కారాన్ని తిరస్కరించారు. దీనిపై స్పందిస్తూ.. 'మనం నమ్మే సిద్ధాంతాలు, సూత్రాలతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడరాదని నేను నమ్ముతాను. నేను నమ్మే, మాట్లాడే రాజకీయాలు, సిద్ధాంతాలు అదానీ గ్రూప్ వంటి డబ్బు ప్రమేయం ఉన్న ఎలాంటి అవార్డు తీసుకోవడానికి విరుద్ధమైనవి. అందుకే నేను వద్దన్నాను. పైగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక బహుళజాతి కంపెనీ అవార్డుల పేరుతో చేసే కార్యక్రమానికి హాజరవ్వడం నాకెంతమాత్రం ఇష్టం లేదు' అంటున్నారు.

రచనలు..పురస్కారాలు..

కైపత్రి యెన్ కనవు కేల్', 'ఇరవు మిరుగమ్', 'కామత్తిపూ', 'తీండపడాత ముత్తం', 'అవలై మొజిపెయర్తాల్', 'ఇప్పడిక్కు ఏవల్' అనేవి సుకీర్తారాణి కలం నుంచి వచ్చిన ఆరు కవితా సంకలనాలు. ఇంగ్లీష్, మలయాళం, కన్నడ, హిందీ, జర్మన్ భాషలలోకి అవి అనువాదమయ్యాయి. ఇంకా ఎన్నో కవితలు, రచనలు ఆమె కలం నుంచి వెలువడ్డాయి. 'తేవమగల్ కవితూవి' అవార్డు, 'పుతుమైపిత్తన్' స్మారక పురస్కారం, 'పెంగల్ మున్నాని' (మహిళా ఫ్రంట్) ద్వారా ఉమెన్స్ అచీవర్ అవార్డులు ఆమెను వరించాయి. ఆమె కవితలు తమిళనాడు కళాశాలల్లో పాఠ్యాంశాలుగా బోధించబడుతున్నాయి. 'కన్నడి మీన్' అనే లఘు చిత్రాన్ని ఆమె 'అప్పావిన్ న్యాబగమరాధి' అనే కవిత ఆధారంగా రూపొందించారు. 2009లో, శ్రీలంకలో తమిళులపై జరిగిన హింసకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో కీలక భూమిక పోషించింది. ప్రస్తుతం ఆమె దళితుల జీవితంపై పుస్తకాన్ని రూపొందించే పనిలో ఉన్నారు.

'ఆపరేషన్ రావణ్' జీవితగా రాధిక



రక్షిత్ అట్లూరి తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ సినిమాలో సీనియర్ నటి రాధిక ఓ కీలకపాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆ పాత్ర లుక్ చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ, 'ఇందులో నేను జీవిత అనే పాత్రను పోషించాను. గతంలో నేను నటించిన 'స్వాతిముత్యం, స్వాతి కిరణం' లాంటి అత్యంత ప్రజాదరణ పొందిన చిత్రాలు ఈ సినిమాలోని ఈ పాత్ర చేస్తుంటే గుర్తొచ్చాయి. దర్శకుడు వెంకట సత్య చెప్పిన 'ఆపరేషన్ రావణ్' స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. నాది ఎంతో హృద్యమైన పాత్ర' అని అన్నారు. తెలుగుతో పాటు ఏక కాలంలో తమిళంలో విడుదలవుతున్న ఈ చిత్రంలో సుధాస్ మీడియా బ్యానర్ మీద ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది.

రేణూ దేశాయ్‌కు అనారోగ్యం



నటి రేణూ దేశాయ్ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన సినిమాల గురించి, వ్యక్తిగత విషయాల గురించి సమాచారాన్ని అందిస్తుంటుంది. తాజాగా ఆమె ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యపై పోస్ట్ పెట్టింది. 'అందరికీ ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. నేను గత కొన్ని సంవత్సరాలుగా గుండె సంబంధ సమస్య, మరికొన్ని ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాను. ఈ విషయాన్ని ఇప్పుడు ఎందుకు చెబుతున్నానంటే.. నాలాగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి ధైర్యాన్నివ్వడం కోసం, వారిలో పాజిటివిటీ నింపేందుకు. మనం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా ధైర్యాన్ని కోల్పోకూడదు. ఎప్పుడూ బలంగా ఉండాలి. అలా ఉంటే ఎప్పటికైనా ఫలితం వస్తుంది. మీపై, మీ జీవితంపై ఆశను కోల్పోవద్దు. ఈ విశ్వం మనకోసం ఎన్నో అద్భుతాలను దాచి ఉంచింది. ఎలాంటి పరిస్థితులనైనా నవ్వుతూ ఎదుర్కోవాలి' అని చెప్పింది. ప్రస్తుతం తాను చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపింది. త్వరలోనే మాములు స్థితికి వచ్చి.. తిరిగి షూటింగ్‌లో పాల్గొనాలని ఆశిస్తున్నట్లు తెలిపింది. ఇక ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు ఆమె త్వరగా కోలుకోవాలని కోరుతూ కామెంట్స్ పెడుతున్నారు.



'సామజవరగమన' టైటిల్ పోస్టర్

హీరో శ్రీవిష్ణు దర్శకుడు రామ్ అబ్బరాజుతో ఓ వినోదాత్మక సినిమా చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమ షూటింగ్ చివరి దశలో ఉంది. కాగా తాజాగా చిత్రబృందం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది.ఏ.కే ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమాకు 'సామజవరగమన' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. వీణను, శ్రీవిష్ణును ఒకే దగ్గర రెడ్ కలర్ రిబ్బన్‌తో కట్టేసున్న పోస్టర్ సినిమాపై కాస్త ఆసక్తి రేకెత్తిస్తుంది. హీరోయిన్‌గా రెబా మోనికా జాన్ నటిస్తుంది. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు.

'అగ్ని నక్షత్రం' గ్లిమ్స్ వీడియో విడుదల



లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై డా.మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'అగ్ని నక్షత్రం' సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సముద్రఖని కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు సిద్దిక్ ముఖ్యపాత్రలో కనిపించనున్నారు. విశ్వంత్, చిత్రా శుక్ల తో పాటు పలువురు నటీనటులు ఈ సినిమాలో భిన్నమైన పాత్రలలో కనిపించబోతున్నారు. తాజాగా 'అగ్నినక్షత్రం' గ్లిమ్స్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఒక్క సంభాషణా లేకుండా నిమిషం నిడివి ఉన్న ఈ వీడియోలో మంచు లక్ష్మి ఇన్వెస్టిగేటివ్ అధికారిగా కనిపిస్తున్నారు. వీడియో చివరిలో ప్రొఫెసర్ విశ్వామిత్ర పాత్రలో మోహన్ బాబు కనిపించారు. అతి త్వరలోనే విడుదల తేదీని తెలియచేస్తామని మేకర్స్ తెలిపారు.

ఓటీటీలోకి 'శివ వేద'



కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'శివ వేద'. సమస్యను ఎదుర్కోవడంలో భయం అంటే తెలియని వ్యక్తి కథాంశమే ఈ సినిమా. ఈ చిత్రాన్ని గీతా పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందించారు. హర్ష ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అర్జున్ జన్యా సంగీతం అందించగా. కన్నడ ఈ చిత్రం హిట్ అయ్యింది. తాజాగా ఈ సినిమా తెలుగులో ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్స్ కంటే జీ 5లో వేద సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. తెలుగు, కన్నడ, హిందీ, మలయాళ, తమిళ, కన్నడ భాషల్లో వేద స్ట్రీమింగ్ అవుతుంది.



'పల్స్' ఫస్ట్ లుక్ విడుదల

యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన 'పల్స్' సినిమా ఆర్.టి.మూవీ మేకర్స్ పతాకంపై రమణ తూముల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. దిలీప్ కుమార్ మల్లా, రోషిణి పటేల్ సింగాని జంటగా నటించిన ఈ చిత్రంలో 'కేరాఫ్ కంచరపాలెం' రాధ, చంద్రశేఖర్ పాత్రుడు, డాక్టర్ శివరాం తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కీరవాణి తండ్రి, రచయిత, దర్శకులు, నటులు కె. శివశక్తి దత్తా ఆవిష్కరించారు. ఈ వినూత్న ప్రేమకథా చిత్రానికి నిజాని అంజన్ సంగీతం సమకూర్చగా, చందు ఏజే సినిమాటోగ్రఫీ అందించారు.

ప్రపంచ అథ్లెటిక్స్, పారిస్ ఒలింపిక్స్‌కు

ప్రియాంక, ఆకాశ్‌దీప్ అర్హత

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్‌కు భారత రన్నర్లు ప్రియాంక గోస్వామి, ఆకాశ్‌దీప్ సింగ్ అర్హత సాధించారు. రాంచీ వేదికగా జరిగిన ఓపెన్ నేషనల్ రేస్ కాంపిటీషన్ 20కి.మీ. వాకింగ్‌లో వీరిద్దరూ అర్హత మార్క్‌కు ముందే గమ్యానికి చేరారు. మహిళల క్వాలిఫికేషన్ సమయం 1:29.20 సెకన్లు కాగా.. రాజస్తాన్‌కు చెందిన ప్రియాంక 1:28.50సెకన్లలోనే గమ్యానికి చేరింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రియాంక తన పేరుమీద జాతీయ రికార్డు(1:28.45సెకన్లు)కు చేరువ కాలేకపోయింది. ఇక 22ఏళ్ల పంజాబ్‌కు చెందిన ఆకాశ్ దీప్ 1:19.55సెకన్లలోనే గమ్యానికి చేరాడు. ఈ క్రమంలో క్వాలిఫికేషన్ మార్క్ 1:20.20 సెకన్లు. మరో జాతీయ క్రీడల రికార్డు గ్రహీత సందీప్ కుమార్ 1:20.16సెకన్లలో గమ్యానికి అతడూ క్వాలిఫై అయ్యాడు. ఇక సూరజ్ పన్వార్ 1:20.21సెకన్లలో గమ్యానికి చేరి 0.01సెకన్లలో వ్యత్యాసంతో తృటిలో ఈ రెండు క్రీడలకు అర్హత సాధించలేక పోయాడు. 2023లో ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు, 2024లో పారిస్ ఒలింపిక్స్ జరగనున్నాయి.





దక్షిణాఫ్రికా సంచలనం

న్యూజిలాండ్‌పై 65పరుగుల తేడాతో గెలుపు

కేప్‌టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో పెను సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటైన న్యూజిలాండ్‌పై ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు సంచలన విజయం సాధించింది. బోలండ్ పార్క్ వేదికగా సోమవారం రాత్రి జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత సఫారీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 132పరుగులు చేసింది. ట్రయాన్(40), డీ క్లార్క్(28), లూస్(22) బ్యాటింగ్‌లో రాణించారు. అనంతరం దక్షిణాఫ్రికా బౌలర్లు మబా(3/10), ట్రియాన్(2/12), కాప్(2/13) బౌలింగ్‌లో చెలరేగారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 18.1ఓవర్లలో 67పరుగులకే కుప్పకూలింది. ఈ టోర్నమెంట్‌లో న్యూజిలాండ్ జట్టుకు ఇది వరుసగా రెండో ఓటమి కాగా.. దక్షిణాఫ్రికా తొలి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ట్రియాన్‌కు లభించింది. దీంతో న్యూజిలాండ్ జట్టు సెమీస్ అవకాశాలు సన్నగిల్లాయి.

మహిళల టి20 ప్రపంచకప్‌లో నేడు..
భారత్ × వెస్టిండీస్ (రా.6.30గం॥లకు)
పాకిస్తాన్ × ఐర్లాండ్ (రా.10.30గం॥లకు)

రెండోరౌండ్‌కు సుమిత్

చెన్నై: చెన్నై ఓపెన్ ఛాలెంజర్స్ టెన్నిస్ టోర్నీలో సుమిత్ నాగల్ సంచలనం నమోదు చేశాడు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సుమిత్ 6-4, 6-4తో 4వ సీడ్, బ్రిటన్‌కు చెందిన రియాన్ పెనిస్టన్‌పై సంచలన విజయం సాధించాడు. అంతకుముందు ప్రజ్నేశ్ గుణ్ణేశ్వరన్, ముకుంద్ శశికుమార్, రామ్‌కుమార్ రామనాథన్ తొలిరౌండ్ పోటీల్లోనే ఓటమిపాలై నిరాశపరిచారు. ప్రజ్నేశ్ 4-6, 6-3, 6-7 (4-7) తేడాతో జే క్లార్క్ చేతిలో పోరాడి ఓడాడు.

గుజరాత్, ముంబయి మ్యాచ్‌తో షురూ!

మహిళల ప్రిమియర్ లీగ్ షెడ్యూల్‌ను విడుదల చేసిన బిసిసిఐ

ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) షెడ్యూల్‌ను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) మంగళవారం విడుదల చేసింది. ఆటగాళ్ల వేలం సోమవారంతో ముగియడంతో ఆరంభ సీజన్‌కు తేదీలు, వేదికలను ఖరారు చేసింది. రంగం సిద్ధం చేసింది. నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో గుజరాత్ జెయింట్స్-ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మార్చి 4న జరిగే తొలి మ్యాచ్‌తో డబ్ల్యుపిఎల్ ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో మొత్తం 20 లీగ్ మ్యాచ్‌లు, ఒక ప్లే మ్యాచ్ జరగనుంది. మొత్తం 23రోజుల పాటు టోర్నీ జరగనుండగా.. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, యుపి, గుజరాత్ జట్లు తొలి సీజన్‌లో టైటిల్‌కై పోటీపడనున్నాయి. గ్రూప్ దశలో ఒక్కో జట్టు రెండేసిసార్లు మిగతా జట్లతో తలపడనుంది. మార్చి 5న రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆరోజు బెంగళూరు-ఢిల్లీ జట్లు బ్రాబౌర్న్ స్టేడియంలో, యుపి వారియర్స్-గుజరాత్ జట్లు డివై పాటిల్ స్టేడియంలో మ్యాచ్‌లు ఆడనున్నాయి. లీగ్‌లో మొత్తం 4 డబుల్ హెడ్డర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫైనల్ లీగ్ మ్యాచ్ మార్చి 21న ఢిల్లీ-యుపి జట్ల మధ్య బ్రాబౌర్న్ స్టేడియంలో, ఎలిమినేటర్ మ్యాచ్‌లు మార్చి 24న డివై పాటిల్ స్టేడియంలో జరగనున్నాయి. ఇక డబ్ల్యుపిఎల్ ఫైనల్ మ్యాచ్ బ్రాబౌర్న్ స్టేడియంలో మార్చి 26న జరగనుంది. టి20 ఫార్మాట్‌లో జరిగే డబ్ల్యుపిఎల్‌లో రూ.3.40కోట్ల రికార్డు ధరకు స్మృతి మంధానాను బెంగళూరు ఫ్రాంచైజీ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

షెడ్యూల్..

తేదీ	ఎవరెవరితో..?	వేదిక	సమయం
మార్చి-4	గుజరాత్ × ముంబయి	డివైపాటిల్	రా.7.30గం॥లకు
5(ఆది)	బెంగళూరు × ఢిల్లీ	బ్రాబౌర్న్	మ.3.30గం॥లకు
	యుపి × గుజరాత్	డివై పాటిల్	రా.7.30గం॥లకు
6(సోమ)	ముంబయి × బెంగళూరు	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
7(మంగళ)	ఢిల్లీ × యుపి	డివైపాటిల్	రా.7.30గం॥లకు
8(బుధ)	గుజరాత్ × బెంగళూరు	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
9(గురు)	ఢిల్లీ × ముంబయి	డివైపాటిల్	రా.7.30గం॥లకు
10(శుక్ర)	బెంగళూరు × యుపి	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
11(శని)	గుజరాత్ × ఢిల్లీ	డివైపాటిల్	రా.7.30గం॥లకు
12(ఆది)	యుపి × ముంబయి	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
13(సోమ)	ఢిల్లీ × బెంగళూరు	డివైపాటిల్	రా.7.30గం॥లకు
14(మంగళ)	ముంబయి × గుజరాత్	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
15(బుధ)	యుపి × బెంగళూరు	డివైపాటిల్	రా.7.30గం॥లకు
16(గురు)	ఢిల్లీ × గుజరాత్	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
18(శని)	ముంబయి × యుపి	డివైపాటిల్	రా.3.30గం॥లకు
	బెంగళూరు × గుజరాత్	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
20(సోమ)	గుజరాత్ × యుపి	బ్రాబౌర్న్	రా.3.30గం॥లకు
	ముంబయి × ఢిల్లీ	డివైపాటిల్	రా.7.30గం॥లకు
21(మంగళ)	బెంగళూరు × ముంబయి	డివైపాటిల్	రా.3.30గం॥లకు
	యుపి × ఢిల్లీ	బ్రాబౌర్న్	రా.7.30గం॥లకు
24(శుక్ర)	**ఎలిమినేటర్**	**డివైపాటిల్**	**రా.7.30గం॥లకు**
26(ఆది)	**ఫైనల్**	**బ్రాబౌర్న్**	**రా.7.30గం॥లకు**

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68